మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | గురువారం | 16.04.2026 | సంపుటి : 01 | సంచిక : 100 | పేజీలు : 12 | వెల : 2/- |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| RAJANNA SIRICILLA | THURSDAY | 16.04.2026 | Volume : 01 | Issue :100 | Pages : 12 | Cost : 2/- |

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్ నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
( కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత )
Ph:9440032006

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్ సిగ్నల్



● ఒకట్రెండు రోజుల్లో జీవో ● మీనాక్షి నటరాజన్‌తో భేటీలో సీఎం నిర్ణయం

**పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ పీసీసీ చీఫ్‌నకు విజ్ఞప్తి**

**హైదరాబాద్,ఏప్రిల్ 15:** అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో

మిగతా2లో...

## టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

● పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా కొనసాగింపు
● ఇద్దరు క్షేత్రస్థాయి నేతలకు పోలిట్ బ్యూరోలో స్థానం
● పార్టీ కార్యవర్గాన్ని పునర్నిర్మించిన చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్ 15** టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. పార్టీకి ఇప్పటి వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్‌ఓ రకంగా ప్రమోషన్ పొందారు. మెల్లగా ఆయన చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నారు. ఇప్టపికే పార్టీలో అంతా తానై నడిపిస్తున్నారు. ఇకపోతే తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటిం చింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి

మిగతా2లో...

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

● మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ ● ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం ● వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 15** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన

మిగతా2లో...



## పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

**ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత**

**వికారాబాద్,ఏప్రిల్ 15 :** వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్‌కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో

మిగతా2లో...

## డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తాం

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము అనుకూలం
- కేంద్రం తీసుకొస్తున్న విధానం సరికాదు
- ప్రతిపక్ష 'ఇండియా బ్లాక్' పార్టీలు స్పష్టం



2లో

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

**యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం**
**మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మం**
**రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం**
**లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు**
**మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష**



**హైదరాబాద్,ఏప్రిల్ 15 :** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిట లైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయిం చారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు

మిగతా2లో...

## దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

**మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు**
**నియోజకవర్గాల పునర్విభజనతో ముడి పెట్టడానికి వ్యతిరేకం**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్,ఏప్రిల్ 15:** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా అన్యాయం చేస్తే పెను ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే అది కేవలం రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదనీ, మొత్తం దక్షిణ భారతదేశం

మిగతా2లో...




## పునర్విభజన జనాభా ప్రకారమే...

**రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే**
**సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు**
**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**వరంగల్,ఏప్రిల్ 15 :** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన పక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011

మిగతా2లో...

## విషాదం..డిటోనేటర్లు పేలి నలుగురు దుర్మరణం..

**మరో 12 మంది పరిస్థితి విషమం**



**అమరావతి ఏప్రిల్ 15 :**ఏపీలో విషాదం చోటు చేసుకుంది. ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు మృత్యువాత పడ్డారు. సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవార్ల గ్రామంలో బుధవారం ఓ ఇంట్లో నిలువ ఉంచుకున్న రాళ్లు బద్దలు చేసే

మిగతా2లో...

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు



- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్,ఏప్రిల్ 15 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను

మిగతా2లో...

## తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

**- పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**



**హైదరాబాద్,15 :** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్

మిగతా2లో...

# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు. 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10 రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు -59, రాష్ట్ర కార్యదర్శులు-77 తో పునర్నిర్మించారు. ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్చార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకకున్నారు.

పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్ అత్యున్నత స్థాయికి ఎదిగారు. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీ ల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించారు. జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు చేశారు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించింది. బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి చంద్రబాబు కమిటీల కూర్పు చేపట్టినట్లు అర్థంఅవుతోంది.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు.

# డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తాం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 15 :** "డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తాం. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేము వ్యతిరేకం కాదు. కానీ కేంద్రం ఈ బిల్లును తీసుకొస్తున్న విధానం సరికాదు" అని ప్రతిపక్ష 'ఇండియా బ్లాక్' పార్టీలు స్పష్టం చేశాయి. బుధవారం నాడిక్కడ రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండియా బ్లాక్' పార్టీల సమావేశం జరిగింది. ఒకపక్క రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుండడం, మరోపక్క కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల డిమాండ్లను పట్టించుకోకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఏకపక్షంగా 'మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్'ను ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. ఆ బిల్లులపై ప్రతిపక్ష "ఇండియా బ్లాక్" పార్టీల సమావేశంలో నేతలు చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కె.సి వేణుగోపాల్, జైరాం రమేష్, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), టి.ఆర్ బాలు (డీఎంకే), సంజయ్ సింగ్ (ఆప్), సంజయ్ రౌత్, అరవింద్ సావంత్ (శివసేన), నిలోత్పల్ బసు (సీపీఐ(ఎం), అనీరాజా (సీపీఐ), సుప్రియా సూలే (ఎన్సీపీ), సాగరిక ఘోష్ (టీఎంసీ), కె.ఎం మణి (కేరళ కాంగ్రెస్), ఎన్.కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్పీ), ఈటి మొహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), కపిల్ సిబల్ (ఇండిపెండెంట్) పాల్గొన్నారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

**ఈ బిల్లు రాజకీయ ప్రేరేపితమైంది: ఖర్గే**

మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, ఈ బిల్లును కేంద్రం తీసుకొస్తున్న విధానం సరికాదని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. అలాగే, డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తాము వ్యతిరేకించడం లేదన్నారు. కానీ, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్నే తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు పన్నుతోందని విమర్శించారు. రాజ్యాంగంలోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు."మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతిపక్షాలు సానుకూలమే. కానీ కేంద్రం తీసుకొస్తున్న విధానంలోనే మాకు అభ్యంతరాలున్నాయి. ఈ బిల్లు రాజకీయ ప్రేరేపితమైందిగా కనిపిస్తోంది. ప్రతిపక్షాల్ని అణచివేసేందుకే కేంద్రం ఈ పని చేస్తోంది. అయినప్పటికీ మేం ఈ బిల్లుకు మద్దతిస్తూ వస్తున్నాం. కానీ, గతంలో చేసిన మార్పుల్ని అమలు చేయాలని కోరాం. డీలిమిటేషన్ అంశంలో కూడా కేంద్రం కొన్ని మెలికలు పెడుతోంది. ఈ అంశంపై అన్ని పార్టీలు పార్లమెంట్‌లో పోరాడుతాయి. డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తాం. కానీ, మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తాం. డీలిమిటేషన్‌కు సంబంధించి జనాభా గణన అంశంపై స్పష్టత లేదు.

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి ....

(మొదటి పేజీ తరువాయి)

సీఎం బుధవారం కీలక సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు నాలుగు గంటలపాటు వారు పలు అంశాలపై చర్చించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఇతర ఆర్గనైజర్ల పోస్టుల భర్తీపై కూడా వారు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. మండల, బూత్ లెవల్ కమిటీల ఏర్పాటుపై సైతం వారు చర్చించారు. కేంద్రం చేపడుతున్న నియోజకవర్గాల పునర్ విభజన, రాష్ట్రానికి జరగబోయే నష్టం గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా త్వరలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించాలంటూ ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్లతోపాటు పార్టీ పదవులను భర్తీ చేసేటప్పుడు క్రియాశీలకంగా ఉన్న జిల్లాలు, అక్కడి సామాజిక సమీకరణాలు, పార్టీ కోసం పనిచేసిన నేతలు తదితరాంశాలపై జాబితాను రూపొందించాలంటూ సీఎం సూచించారు. ఒక్కో ఆశవహుడి పేరును ప్రస్తావిస్తూ ఆయన చర్చించారు. 'ఒక్కరికి కేవలం ఒక పదవే...' అనే సూత్రాన్ని పక్కాగా, తూ.చా. తప్పకుండా పాటించాలంటూ కోరారు. ఇదే విధంగా భవిష్యత్ అవసరలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సమీకరణాలు, పొందికలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే కార్పొరేషన్ చైర్మెన్లు, ప్రభుత్వ సలహాదారుల పోస్టుల కోసం వందలాది మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఆ జాబితాను సాధ్యమైనంతగా వడబోసి, పార్టీకి విధేయులుగా ఉండి, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం పని చేసి, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించాలని సీఎం భావిస్తున్నారు. వారిలోంచి మొదటి దఫాగా 20 నుంచి 25 మందికి పదవులను కట్టబెట్టాలని ఆయన నిర్ణయించారు. ఇదే సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులకు ప్రాధాన్యతనిస్తూనే రెడ్డి సామాజిక తరగతిని కూడా 'సంతృప్తి' పరిచే విధంగా జాబితాలను సిద్ధం చేయాలని సీఎం... పీసీసీ చీఫ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో కనీసం 30 శాతం మహిళలకు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. మూడేండ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమనీ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని పేర్కొన్నారు. జనాభా నియంత్రణతోపాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రాతినిధ్యాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. "ఢిల్లీ పాలకులు తమ మాట వినాలనీ, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడమే కాకుండా, అసెంబ్లీ, శాసన మండలిలో ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, మార్కెట్ కమిటీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత పట్ల తమకున్న అచంచలమైన నిబద్ధతను చాటుకున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ లతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అత్యంత సరళమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనీ, పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయనీ, వాటికి వర్తింపజేయాలని సూచించారు. తెలంగాణ లో 119 అసెంబ్లీ స్థానాలున్నాయనీ, ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. సీట్ల పెంపు పునర్విభజనతో ముడిపెట్టి ఎందుకు అయోమయా న్ని సృష్టిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. రాజ్యాంగ విధివిధానాల ప్రకారం మొదట జనగణన, తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, ఆ తర్వాతే నిర్మాణాత్మక మార్పులు జరగాలని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనా లకు విఘాతం కలగని ఏ సహేతుకమైన ప్రతి పాదనకైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. దక్షిణాదికి అన్యాయం చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామనీ, అవసరమైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

(మొదటి పేజీ తరువాయి)

పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.ద

# విషాదం..డిటోనేటర్లు పేలి నలుగురు దుర్మరణం..

(మొదటి పేజీ తరువాయి)

డిటేనేటర్లు పేలాయి. దీంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి ఇంట్లో ఉన్న నలుగురు మృతి చెందారు. మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పేలిన ఇళ్లు పూర్తిగా నేలమట్టామయ్యింది. గ్యాస్ పేలుడు దాటికి సమీపంలో ఉన్న ఇళ్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి . పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు ముమ్మరం చేశారు.

# తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

(మొదటి పేజీ తరువాయి)

సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

# పునర్విభజన జనాభా ప్రకారమే...

(మొదటి పేజీ తరువాయి)

జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమై నవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమె త్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచం దర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ పక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన పక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

# పాటలు తప్ప స్కామ్‌లు తెలియవు

## • మీడియా ముందు మంగ్లీ ఆవేదన

**హైదరాబాద్,ఏప్రిల్ 15:** తనపై వస్తున్న ఆరోపణల కారణంగా చాలా నగిలిపోతున్నానని, తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. విచారణ చేసుకోవాలని.. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని చెప్పారు. బుధవారం మంగ్లీ మీడియా తో మాట్లాడుతూ.. 'పేదరికం నుంచి వచ్చాను. డబ్బు విలువ నాకు తెలుసు. నెల రోజు లుగా నా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నా. ప్రజల్లోకి తప్పుగా వెళ్తోంది. బాధితులకు నేను అండగా ఉంటా. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేశాను' అని అన్నారు. మంగ్లీ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. 'నేరగాళ్లే బాధితుల రూపంలో పోలీస్ స్టేషన్‌కి వస్తున్నారు. అసలు స్కామ్ చేసిన వాళ్లే మీడియా ముందుకు వచ్చి బాధితులుగా మాట్లాడుతున్నారు. సుభాక్షేత్ర బిజినెస్ అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి.. దానికి ఎండీగా ఉన్నది మధు. ప్రస్తుతం బాధితుడిగా మీడియాతో మాట్లాడుతున్న హిమాకాంత్ రెడ్డి ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఈ స్కామ్‌కి మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదు' అని అన్నారు.

# మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో గాయత్రి విద్యార్థుల సత్తా

**● స్టేట్ ర్యాంక్, 9 గోల్డ్ మెడల్స్ సాధన**

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి:ఏప్రిల్ 15:**గాయత్రి విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు గౌరవాన్ని తెచ్చిపెట్టారు. రాష్ట్ర స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ పోటీల్లో 7వ తరగతి విద్యార్థి ఏ. సాత్విక్ తేజ రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంక్ సాధించి ప్రతిభను చాటుకున్నాడు. అదేవిధంగా మొత్తం 9 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు. గోల్డ్ మెడల్స్ సాధించిన వారు: డి. శ్రీనికేష్, ఏ. ప్రణవ్, టి. అవ్యాన్ సాయి, కె. వేదశ్రీ (1వ తరగతి),



సిహెచ్. సుమతి (2వ తరగతి), కె. శ్రీనిత్య (3వ తరగతి), ఆర్. శివాంశ్ (4వ తరగతి), బీ. జశ్వంత్ (5వ తరగతి), ఎన్. శ్రీహిత (8వ తరగతి). ప్రత్యేకంగా టి. అవ్యాన్ సాయి మూడు గోల్డ్ మెడల్స్ సాధించగా, బీ. జశ్వంత్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం. ఈ విజయాలను పురస్కరించుకొని విద్యాసంస్థల చైర్మన్ అలంకి శ్రీనివాస్, కరెస్పాండెంట్ రజనీదేవి విద్యార్థులను గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒలింపియాడ్‌లాంటి పోటీ పరీక్షలు విద్యార్థుల్లో లోతైన ఆలోచనా శక్తి, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక, మ్యాథ్స్ టీచర్ నవ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు విద్యార్థుల విజయాలకు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహణను ప్రశంసించారు.

# తెలంగాణ ఉద్యమకారుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



**ప్రజావాణి శాయంపేట :** మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడి శెట్టి గణేష్ శాయంపేట మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో శాయంపేట ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్ గారికి తెలంగాణ ఉద్యమకారులకు ఉద్యమకారుల భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడి శెట్టి గణేష్ శాయంపేట మండల అధ్యక్షులు ఇమ్మిడి శెట్టి రవీందర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న 542 గల సర్వే నెంబర్ భూమిలో ఎనిమిది గుంటల ప్రభుత్వ స్థలం కలదు అట్టి స్థలంలో ఉద్యమకారులకు సమావేశం పరుచుకొనుటకు సమావేశం ఏర్పాటు చేసుకొనుట కొరకు కమ్యూనిటీ హాల్ భవనానికి స్థలం కేటాయించాలని మండల కేంద్రంలో 200 పైగా తెలంగాణ ఉద్యమకారులు ఉన్నామని తెలంగాణ తెచ్చిన మాకు కనీస గౌరవం లేకుండా పోతుందని మాకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసుకొనుటకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా ఈనెల 18వ తేదీన హైదరాబాదులో జరిగే ఉద్యమకారుల సదస్సును మండలంలో ఉన్న అందరూ ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు గిద్ద మరి సురేష్ యూత్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల శివ మండల కోశాధికారి కానుగుల నాగరాజు బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ టి యు ఎఫ్ జిల్లా నాయకులు రాయరాకుల మొగిలి గిద్దె మారి రామన్న రంగు మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ

**● విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలి**
**● భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (ఏప్రిల్ 15):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ -- అ లైవ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో "రోడ్డు భద్రతపై అవగాహన" ర్యాలీని జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా ప్రారంభించారు. "రహదారుల భద్రత మన అందరి బాధ్యత" అనే నినాదంతో ప్రారంభమైన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రహదారుల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అత్యంత కీలకమని అన్నారు. చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలనే విషయాన్ని గుర్తుచేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డు నియమాల పాటింపు వంటి





అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించాలన్నారు.
రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. "అరైవ్ -- అ లైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి,



కోఆర్డినేటర్ నాగశేఖరా శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# వడదెబ్బ - తీసుకోవలసిన జాగ్రత్త లు.

**గరిడేపల్లి ప్రజావాణి ఏప్రిల్ 15:** ఈరోజు గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి నరేష్ గారు వడదెబ్బ గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వడదెబ్బ లక్షణాలు, శరీర ఉష్ణోగ్రత ఎక్కువ అవ్వడం, తలనొప్పి, తల తిరగడం వాంతులు, అధిక చెమటలు లేదా చెమటలు లేకపోవడం ఈ లక్షణాలు ఉంటాయన్నారు. ఈలక్షణాలు ఉన్నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. నివారణ చర్యలుగా ఎక్కువగా నీరు తాగాలన్నారు. మరియు నిమ్మరసం, మజ్జిగ త్రాగాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి నాలుగు గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండటం మంచిది అన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఎండలు తీవ్రతరంగా ఉన్న దృష్ట్యా బయటి పనులను ఉదయం 12గంటల లోపు ముగించుకోవాలన్నారు అదేవిధంగా సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. బయటకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా గొడుగు టోపీ లేదా చేతి రూమాలను తలపై ఉంచుకోవాలన్నారు. పలుచని కాటన్ దుస్తులను ధరించాలన్నారు. గ్రామాలలో ఆశా కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. కావున ప్రజలందరూ ఎండలు తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, వేగం పై జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి

**● ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మాణాలు**
**● గడువులోపు ఇందిరమ్మ ఇళ్లులు పూర్తి చేయాలని ఆదేశాలు**

**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (ఏప్రిల్ 15):** సుజాతానగర్ మండలం మర్రితండ గ్రామంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం రోజు సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 99 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా, అందులో 65 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి, నిర్మాణ నాణ్యత పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన వ్యయం, ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.
లేబర్ చార్జీలు ఎంత అవుతున్నాయి, అదనంగా లబ్ధిదారులు ఎంత మొత్తం వెచ్చిస్తున్నారు వంటి అంశాలపై ప్రశ్నించి సమగ్ర సమాచారం సేకరించారు. ఈ క్రమంలో మూడ్ మౌనిక, హాథీరాం, భూక్య అమల, భూక్య సునీత, భూక్య పంతులీ తదితర లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో సుమారు 650 మంది జనాభా ఉండగా, వారిలో అధిక సంఖ్యలో తాపీ మేస్త్రీలు ఉన్నారని కలెక్టర్ గమనించారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయానికి అదనంగా లబ్ధిదారులు స్వంతంగా పెట్టుబడి పెట్టి, తామే స్వయంగా ఇళ్ల నిర్మాణంలో పాల్గొనడం ద్వారా లేబర్ ఖర్చులను తగ్గించుకుంటూ ఇళ్లను నిర్మించుకుంటున్న విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనల ప్రకారం జరుగుతోందో లేదో అధికారులను ప్రశ్నించి వివరాలు







తెలుసుకున్నారు. ఇళ్ల విస్తీర్ణం, నిర్మాణ పరిమాణాన్ని అధికారులతో టేప్‌తో కొలిపించి నిర్ధారించారు. ఎలాంటి నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ అన్ని నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయాలని, పనుల పురోగతిపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు



అనుగుణంగా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, గృహనిర్మాణ శాఖ ఏఈ లాల్ సాబ్, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ వార్డ్ మెంబర్ కు బిఆర్ఎస్ నాయకులు పరామర్శ

**● మలిదశ ఉద్యమకారుడు గుగులోతు నీలా హేమ్లా నాయక్**



**గరిడేపల్లి ప్రజావాణి ఏప్రిల్ 15:**ఈరోజు గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న గారకుంట తండ గ్రామానికి చెందిన బానోతు చిలకమ్మ గారికి గర్భకోశ సర్జరీ చేయించుకున్నందున తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోతు నీలాహేమ్లా నాయక్ ఆధ్వర్యంలో పరామర్శించడం జరిగింది గ్రామంలో నిరుపేదలకు అభాగ్యులకు ఏ అవసరము వచ్చినా కూడా అందుబాటులో ఉంటామని ప్రభుత్వ పథకాలు అందించడంలో కూడా ముందువరుసులో ఉంటామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు సందీప్ నాయక్ మాజీ ఎంపీటీసీ వెంకట్రాశీ నాయక్ మాజీ నీటి సంఘం డైరెక్టర్ వెంకట్రాశీ నాయక్ బాలు నాయక్ గ్రామ శాఖ అధ్యక్షులు నరేందర్ నాయక్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు రవీందర్ నాయక్ పులియా నాయక్ కాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు

# భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**● జగిత్యాల అదనపు కలెక్టర్ బి.ఎస్.లత**

**రాయికల్:ఏప్రిల్ 15 (ప్రజావాణి):**భూభారతి లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జగిత్యాల అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. బుధవారం రాయికల్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ మరియు



సాదాబైనామాకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత మాట్లాడుతూ.. నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు అందించాలని ఆదేశించారు. జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులను అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. జనగణనకు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమిస్తున్నామని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి నివేదికలను సమయానికి సమర్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాయికల్ తహసీల్దార్ నాగార్జున, రెవెన్యూ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాల సాధనే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళులు..

- మనం అనుభవించే రాజ్యాంగ ఫలాలు అంబేద్కర్ త్యాగాల తోనే..
- సామాజిక ఉద్యమకారుడు బాబాసాహెబ్ అంబేద్కర్..
- మాజీ సర్పంచ్ కిషన్ పవర్ మాట్లాడుతూ.....
- సావార్ గావ్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు..



**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి ఏప్రిల్ 15:**అంబేద్కర్ ఆశయాలను సాధించడమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళులు అని జుక్కల్ మండలంలోని సావర్గావ్ గ్రామంలో గల మాజీ సర్పంచ్ కిషన్ పవర్ , అశోక్ పటేల్ అన్నారు. మంగళవారం సావర్గవ్ లో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం మనం అనుభవించే రాజ్యాంగ ఫలాలు అంబేద్కర్ త్యాగం తోనే అని అంబేద్కర్ దేశానికి చేసిన సేవను స్మరించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారని అంబేద్కర్ త్యాగాలను కొనియాడారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు. సర్పంచ్ కపిల్, మాజీ సర్పంచ్ కిషన్ పవర్, మాజీ సర్పంచ్ రామారావు, ఉప సర్పంచ్ సుధాకర్, గ్రామ పెద్దలు అశోక్ పటేల్, మాజీ ఉపసర్పంచ్ శంకర్, రవి రాథోడ్, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు..

# ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● రేకొండ పంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్



**మన ప్రజావాణి ప్రతినిధి (చిగురుమామిడి):** ప్రస్తుతం ఎండలు రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేకొండ గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్ సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా గ్రామస్తులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. ఆయన మాట్లాడుతూ...నీరు ఎక్కువగా తాగాలి: దాహం వేయకపోయినా తరచూ నీటిని తాగాలి. మజ్జిగ, కొబ్బరి నీళు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురికాదు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దు. వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తడి తువ్వాలు ఉపయోగించాలి.తేలికపాటి, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం ఉత్తమం. వేసవిలో త్వరగా అరిగే ఆహారం తీసుకోవాలి. నిల్వ ఉన్న పదార్థాలు, మితిమీరిన మసాలాలకు దూరంగా ఉండాలి.వడదెబ్బ తగిలితే ఎవరికైనా నీరసం లేదా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ORS కలిపిన నీటిని అందించి దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి.ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు తమ పనులను ఉదయం పూటే ముగించుకోవాలని, చిన్నపిల్లలు మరియు వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని గోదారి అజయ్ కుమార్ కోరారు.

# ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలే ప్రభుత్వ లక్ష్యం

● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.డిప్యూటీ సి.ఎం. బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి టీజీ ఎన్పిడిసిఎల్ ద్వారా పెనుబల్లి మండలం తుమ్మలపల్లిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ నియంత్రికల మరమ్మతు కేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, పెనుబల్లిలో రూ.7 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.అలాగే విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు.గ్రామీణ అభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొంటూ, ప్రతి గ్రామంలో మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి





కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.విద్యుత్ సరఫరా విషయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నూతనంగా చేపట్టిన సబ్‌స్టేషన్ల నిర్మాణం, మరమ్మత్తు కేంద్రాల ద్వారా వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు ప్రస్తుత సబ్‌స్టేషన్లపై ఉన్న ఓవర్ లోడ్ తగ్గుతుందని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా వేలాది మంది వినియోగ దారులకు ప్రయోజనం కలగడంతో పాటు విద్యుత్ వోల్టేజ్ నియంత్రణ,పవర్ ఫ్యాక్టర్ మెరుగుదల సాధ్యమవుతుందని అన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యుత్ రంగంలో చేపడుతున్న సబ్‌స్టేషన్లు, మరమ్మత్తు కేంద్రాల నిర్మాణం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందుతాయని, వేసవిలో కూడా నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. ఆరోగ్య, విద్య రంగాల బలోపేతంతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతా యని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసిపి, ఎస్ఈ ఎన్పిడిసిఎల్ శ్రీనివాస చారి, డి.ఎం అండ్ హెచ్.ఓ. డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చిగురుమామిడిలో రోడ్డు భద్రత వారోత్సవాలు

● విద్యార్థులకు 'అరైవ్.. అలైవ్' అవగాహన కార్యక్రమం



**మన ప్రజావాణి ప్రతినిధి చిగురుమామిడి, ఏప్రిల్ 15:** రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని డార్విన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో బుధవారం 'అరైవ్.. అలైవ్' అవగాహన కార్యక్రమాన్ని ఎస్సై పృధ్వీధర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. పాదచారులు రహదారిపై సురక్షితంగా నడిచే విధానం, వాహనదారులు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వాడకం తప్పనిసరిగా పాటించాలని ఎస్సై పృధ్వీధర్ గౌడ్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం ప్రమాదకరమని వివరించారు.మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదని, ఒకవేళ నడిపినట్లయితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాల గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం ఇటీవల నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి మార్క శివేంద్ర ను ఎస్సై శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కే. సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరుగాలం కష్టపడి పండించిన పంటకి రోజుకో మాట చెపుతున్న దళారీలు

**గరిడేపల్లి ప్రజావాణి ఏప్రిల్ 15:** ఈరోజు గరిడేపల్లి మండలం తాళ్ల మల్కాపురం గ్రామంలో రైతు సంఘం మండల మహాసభలో ముఖ్య అతిథిగా హాజరై ఆరుగాలం శనించి పండించిన వరి పంటను కొనుగోలు చేయటంలో రోజుకో మాట మాట్లాడుతున్నారని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు అన్నారు రోజుకో విధానం పాటించడం మూలాన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు రైస్ మిల్లు కొనుగోలు కేంద్రాలను అధికారులు సందర్శించి రోజువారి డేటా సేకరించాలని 15 రోజులకే సుమారు క్వింటాల్కి 300 రూపాయలు ధర తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని శేఖర్ రావు అన్నారు సాగర్ ఎడమక్కాయల పరిధిలో ఆయకట్టు కింద వరి ముమ్మరంగా సాగుతుందని ధాన్యం అధికంగా



రావడంతో ధరలు తగ్గిస్తున్నారని దీనికి తోడుగా పచ్చ గింజలు కొనుగోలు చేయవలె మరి చెప్పటం రైతులకు నిరాశ చెందుతున్నారని అన్నారు ఇంటర్నెట్ సంబంధిత అధికారులు రాష్ట్ర ప్రభుత్వం రెండో పంట రైతుబంధు వెంటనే విడుదల చేయాలని రెండు లక్షల రుణమాఫీ చేసి రైతుకి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని శేఖర్ రావు డిమాండ్ చేశారు కేనాల సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ ఈ సభలో సిఐటియు నాయకులు ఎస్.కె యాకూబ్ గీత కార్మిక సంఘం నాయకులు తుమ్మల సైదయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దోసపాటి భిక్షం మాజీ సర్పంచ్ హేమ గాని వెంకటేశ్వర్లు సీనియర్ మల్కాపురం శాఖ కార్యదర్శి ఒట్టికూటి అంజయ్య వార్డు మెంబర్ మచ్చ గురువయ్య పూలే ఎంకన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు దొంతగాని లక్ష్మయ్య జుట్టుకొండ వీరస్వామి అంబటి బిక్షం మాజీ ఎంపీటీసీ యానాల సుశీల బి శ్రీనివాస్ రాయిరాల శ్రీనివాస్

# చౌడేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు -- మెరుగైన ఉత్తీర్ణత శాతం నమోదు




**మన ప్రజావాణి చౌడేపల్లి, ఏప్రిల్ 15:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించారు. కళాశాల మొత్తం ఉత్తీర్ణత శాతంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 70% సాధించగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 57% ఉత్తీర్ణత నమోదు చేయడం విశేషం.ద్వితీయ సంవత్సరం విభాగంలో సి.ఈ.సి గ్రూప్‌కు చెందిన టి. లహరి (కాగతి) 945 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. అలాగే ప్రథమ సంవత్సరం హెచ్.ఈ.సి గ్రూప్‌లో డి. హరి (పెద్ద కొండామారి) 429 మార్కులతో మొదటి స్థానం సాధించారు.అంతేకాకుండా, హిందీ, తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ వంటి పలు విషయాల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించడం కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, అధ్యాపకుల శ్రమ, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందిస్తూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.

# మత్తుకు దూరంగా... మైదానంలోకి అడుగు పెట్టండి:

● మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, ఏప్రిల్ 15:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని పిలుపునిస్తూ పెద్దపల్లి నియోజకవర్గంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యాల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ జిల్లా ఇంచార్జి వెంకటేష్ హాజరై టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ యువత మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసవుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత క్రీడల్లో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటాలని, క్రీడల ద్వారా కూడా మంచి అవకాశాలు, ఉద్యోగాలు సాధించవచ్చని సూచించారు.అనంతరం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల నరేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన "మత్తు వదిలి మైదానంలోకి రండి" అనే నినాదంతో యువత ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్ ద్వారా నియోజకవర్గంలోని యువ క్రికెటర్లకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదిక లభిస్తుందని చెప్పారు. యువత





డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. టోర్నమెంట్



లో పాల్గొనే క్రీడాకారులకు ఆయన ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుమ్మడి ప్రసాద్, పిరంగి రాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ఎంచర్ల తిరుమలేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆయూబ్ భాయ్, కార్యదర్శి అభినయ్ గౌడ్, కోడపత్రి మధుకర్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రవణ్, మండల అధ్యక్షులు జడల రాజు, సిరిసెటి రాహుల్, ఒర్రె అజయ్ యాదవ్, దేవేందర్ రెడ్డి, అరగొండ రాజ్ కుమార్, వెలిశాల రాకేష్, రాకేష్ యాదవ్, గుర్రాల వాసు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ కళా దినోత్సవ వేడుకలు



**నేలకొండపల్లి ప్రతినిధి మన ప్రజావాణి :** ఖమ్మంజిల్లా నేలకొండపల్లిలో గల భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తదనంతరం సంఘం సభ్యులు కేక్ కటింగ్ చేశారు.ఖమ్మం జిల్లా కళాకారుల సంఘం తెల్లగొర్ల లింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు లియొనార్డో డావెన్సీ పుట్టినరోజు సందర్భంగా ఆయన గౌరవార్థం ఈ ప్రపంచ కళా దినోత్సవం 2012 నుండి నిర్వహిస్తున్నారని తెలియజేశారు. కళ అనగా సృజనాత్మకత, ప్రతిభ అని అన్నారు. ప్రపంచంలో 64 కళలు ఉన్నాయని ఎవరి కళలో వాళ్ళు ముందుకు వెళ్లాలని తెలియజేశారు. కళలు ఉండడంవల్ల మనసులో ఉత్సాహం పెరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ నంది అవార్డు గ్రహీత కవి సామ్రాట్ చిలకాబత్తిని వీరబాబు, బిజెపి పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు, తునికి పార్టీ లక్ష్మణాచారి, ఏపూరి సత్యనారాయణ,భిక్షం నాయక్, సూరేపల్లి జ్ఞానరత్నం, కట్టెకోల వెంకటేశ్వర్లు, కుక్కల ప్రభాకర్, లొడంగి కొండలు, లక్ష్మణ చారి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

# క్లిష్ట పరిస్థితిలో మహిళ ప్రాణాలు కాపాడిన

● పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, ఏప్రిల్ 15:** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన 36 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుంది. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో గర్భధారణ గర్భాశయంలో కాకుండా ఫాలోపియన్ ట్యూబులో ఏర్పడిన ఎక్టాపిక్ ప్రెగ్నెన్సీగా గుర్తించారు. అది పెరిగి పగిలిపోవడంతో (Ruptured Ectopic Pregnancy) ఆమె పరిస్థితి అత్యంత విషమంగా మారింది.పేషెంట్ హిమోగ్లోబిన్ స్థాయి కేవలం 7 గ్రాములు మాత్రమే ఉండగా, సిస్టోలిక్ రక్తపోటు 70కి పడిపోయింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వైద్యులు అత్యంత నైపుణ్యంతో తక్షణ శస్త్రచికిత్స (సాల్పింజో-ఓఫరెక్టమీ) నిర్వహించి మహిళ ప్రాణాలను రక్షించారు.ఈ శస్త్రచికిత్సలో గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ స్వాతి కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా మరో రోగికి యూరాలజీ శస్త్రచికిత్సను కూడా విజయవంతంగా నిర్వహించారు. ఈ సర్జరీల్లో డాక్టర్ సంతోష్, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రామం పాల్గొన్నారు.విజయవంతమైన ఈ శస్త్రచికిత్సల్లో పాల్గొన్న వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్



శ్రీధర్ మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం, కంటి స్కానింగ్, కంటి శస్త్రచికిత్సలు (ఫాకో సర్జరీ), 2డీ ఎకో సేవలు, ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ సేవలు, రూట్ కెనాల్ వంటి అనేక ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా, ఆసుపత్రిలో శుభ్రత, వాష్‌రూమ్ నిర్వహణ లేదా ఇతర సేవల




విషయంలో ఎవరైనా డబ్బులు అడిగినా వెంటనే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని, లేకపోతే కంప్లైంట్ బాక్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు ఉచితమని, ఎవరికి లంచాలు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. అలాగే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగాల పేరుతో మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, నియామకాలు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని వారధి సొసైటీ ద్వారానే జరుగుతాయని తెలిపారు

# ఎంపీ వంశీకృష్ణ చుట్టూ స్వార్థపరుల కోట:

● బొంకూరి కైలాసం విమర్శలు



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, ఏప్రిల్ 15 :**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం నిస్వార్థంగా పనిచేసిన కార్యకర్తలకు అవమానం జరుగుతోందని, కొందరు నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం గోడలా మారి ఎంపీని కలవనీయకుండా అడ్డుకుంటున్నారని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం కమాన్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తురకల మద్దికుంట మాజీ సర్పంచ్ సజ్జద్ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. ఇటీవల జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు.ఎంపీ వంశీకృష్ణను కలిసేందుకు ఉదయం 7 గంటల నుంచే అంబేద్కర్ విగ్రహం వద్ద వేచి ఉన్నప్పటికీ, సజ్జద్ కావాలనే అడ్డుకున్నారని ఆరోపించారు. కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా ఎంపీ చేత పూలమాల వేయించి వెంటనే పంపించివేయడం తనను తీవ్రంగా బాధించిందన్నారు.ఎంపీ ఎన్నికల సమయంలో మాదిగ సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ ఉన్నప్పటికీ, వంశీకృష్ణ గెలుపే లక్ష్యంగా 30 మందితో కమిటీ ఏర్పాటు చేసి పనిచేశానని తెలిపారు. సొంత సామాజిక వర్గాన్ని పక్కనపెట్టి మాల సామాజిక వర్గానికి చెందిన వంశీకృష్ణకు మద్దతుగా నిలిచిన తొలి వ్యక్తిని తానేనని చెప్పారు.మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబంపై ఉన్న గౌరవంతో పనిచేసిన తనను, అదే మాదిగ కులస్తుల ముందు అవమానించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

యువ నాయకుడైన ఎంపీ వంశీకృష్ణ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానని, అయితే సజ్జద్ వంటి వారు స్వార్థ ప్రయోజనాల కోసం నాయకులను ప్రజల నుంచి దూరం చేస్తున్నారని విమర్శించారు. నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలను దూరం చేస్తే పార్టీకి నష్టం జరుగుతుందని హెచ్చరించారు.తనకు జరిగిన అవమానం మరెవ్వరికీ జరగకూడదని, అన్ని వర్గాల ప్రజలు ఇలాంటి స్వార్థపరుల తీరుపై అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రమాద భీమా చెక్కు అందజేత



**రాయికల్ :ఏప్రిల్ 15 (ప్రజావాణి):**రాయికల్ మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన కండ్లపెల్లి సాయిరాజ్ గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ రాయికల్ బ్రాంచ్ లో నిర్భయ సేవింగ్ ఖాతాను ప్రారంభించారు. ఇటీవలే ప్రమాదవశాత్తు ఖాతాదారుడు మరణించగా మృతుడి తల్లి కండ్లపెల్లి లక్ష్మికి ప్రమాద భీమా కింద మంజూరైన ఒక లక్ష రూపాయల చెక్కును బుధవారం తహశీల్దార్ ఎస్.నాగర్జున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....గాయత్రి కో-ఆపరేటివ్ బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం సూచించారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సోమ మధు, సీనియర్ ఆఫీసర్ జి.రాము,జూనియర్ ఆఫీసర్ ఎంఎ అసీవుద్దీన్, గోల్డ్ అప్రైజర్ గన్నవరం గంగాధర్,ఆర్ఐ పద్మయ్య, కైరం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# జలధార--జలహారతి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ నిశాంత్ కుమార్





**మన ప్రజావాణి చౌడేపల్లి, ఏప్రిల్ 15:**అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలో చేపట్టిన జలధార--జలహారతి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, పనుల ప్రగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా మండలంలో 'జలధార--జలహారతి' కింద చేపట్టిన 100 రోజుల పనులపై ఎంపీడీవో, వాటర్ రిసోర్స్ పర్సన్ మరియు ఇతర శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. మండలంలోని మొత్తం చెరువుల సంఖ్య, నీటితో నిండిన చెరువుల వివరాలు తెలుసుకున్నారు. మేజర్, మైనర్, సబ్, మైక్రో బేసిన్ స్థాయిలో మిగులు, లోటు ప్రాంతాలను గుర్తించి, కాస్కేడ్ విధానంలో చెరువులను అనుసంధానం చేసే పనులు చేపట్టాలని సూచించారు.వివిధ శాఖలైన నరేగా, గ్రౌండ్ వాటర్, వాటర్ రిసోర్స్ విభాగాల మధ్య సమన్వయం పెంపొందించి పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జలధార ప్రాజెక్టును శాస్త్రీయ విధానంతో ముందుకు తీసుకెళ్తున్నామని, గతంలో ఫీడర్ చానెల్స్, డీసిల్టేషన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాబోయే వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసి ప్రతి నీటి చుక్కను సంరక్షించడమే లక్ష్యమని చెప్పారు. మండలంలో ఉన్న 243 ఎంఐ ట్యాంకులను సమగ్రంగా వినియోగిస్తూ, టీఎంసీ స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.అనంతరం భూ సమస్యల పరిష్కారంపై తాసిల్దార్ మరియు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొన్ని సచివాలయాల్లో ప్రగతి సంతృప్తికరంగా లేదని గుర్తించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.తదుపరి దిగువుపల్లి పంచాయతీ శెట్టి కుంట చెరువు, కాగతి పంచాయతీ చెరువులను పరిశీలించిన కలెక్టర్, వాటి మధ్య ఉన్న కనెక్టివిటీ ఛానల్‌ను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న కట్టను తొలగించాలని రైతులు చేసిన వినతిపై స్పందిస్తూ, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీలమాధవి, తాసిల్దార్ పార్వతి, సిఐ సాయి ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 17న పెద్దపల్లిలో భారీ ఉద్యోగ మేళా:

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, ఏప్రిల్ 15:**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (TASK) రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17న ఉదయం 10 గంటల నుండి పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి.ఈ డ్రైవ్‌లో డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఏజే సొల్యూషన్స్, వార్కస్ ఈవీ మోటార్స్, మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ వెంట రెండు సెట్ల తాజా బయోడేటా (రెజ్యూమ్) తీసుకురావాలని, తప్పనిసరిగా ఫార్మల్ డ్రెస్‌లో హాజరుకావాలని సూచించారు. నిర్ణీత సమయానికి ముందుగానే వేదికకు చేరుకోవాలని తెలిపారు.జిల్లాలోని అర్హత కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి కంపెనీలలో ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాల కోసం పెద్దపల్లిలోని టాస్క్ రీజినల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# పాతగూడూరు ప్రజల చిరకాల స్వప్నం సాకారం

● పోచమ్మ గుడి దారి కోసం రూ. 18 లక్షల చెక్కు అందజేసిన పొనుగోటి



**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి ఏప్రిల్ 15 (ప్రజావాణి):**జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాతగూడూరు గ్రామ ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. గ్రామంలోని పోచమ్మ గుడికి వెళ్లే దారి సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు (బాపు) తన ఉదారతను చాటుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పోచమ్మ గుడికి సరైన దారి లేక గ్రామస్తులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంలో. ఈ సమస్యను గ్రామ పెద్దలు పొనుగోటి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆ దారికి అవసరమైన భూమిని సేకరించేందుకు నడుం బిగించారు. ఇందులో భాగంగా,బుధవారం రోజున భూమి యజమాని సుంకిశాల శ్రీనివాస్ రావుకు దారికి సంబంధించిన పరిహారం కింద 18 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. నాయకులు హామీలు ఇవ్వడం సహజమని, కానీ ఇచ్చిన మాట ప్రకారం భారీ మొత్తాన్ని వెచ్చించి సుమారు 4 గుంటల దారి ఏర్పాటుకు కృషి చేయడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా వాయిదాలో ఉన్న పాతగూడూర్ గ్రామ ప్రజల కోరికను బాపు నెరవేర్చారు. పోచమ్మ తల్లి దర్శనానికి వెళ్లే భక్తుల కష్టాలు తీర బోతున్నాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాత గూడూరు గ్రామ ప్రజలు పొనుగోటి శ్రీనివాసరావుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్య క్రమంలో స్థానికసర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి,కడారి సత్యనారాయణ,జక్కుల సాగర్,వరిమడ్ల గట్టయ్య పాల్గొన్నారు.

# బచ్చలకూరి నాగరాజు మాదిగకు దళిత రత్న పురస్కారం..

● ఉద్యమకారుడు బచ్చలకూరి నాగరాజుకు దళిత రత్న గౌరవం..





**కోదాడ, ఏప్రిల్ 15/ ప్రజావాణి:**ఎస్సీ వర్గీకరణ మలిదశ ఉద్యమకారుడు, కోదాడ పట్టణానికి చెందిన బచ్చలకూరి నాగరాజు మాదిగకు రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డుతో గౌరవించింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఉత్సవాల కమిటీ చైర్మన్ గంటా సుదర్శన్ చేతుల మీదుగా నాగరాజు ఈ అవార్డును అందుకున్నారు. జాతి ప్రయోజనాల కోసం ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో భాగస్వామినై జాతి కోసం కృషి చేస్తున్నానని, ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. తనకు సహకరించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రి...

● యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో దారుణ ఘటన.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15:**ధర్మేచ అర్తేజ కామేచ మోక్షేచ నాతిచరామి అని ప్రమాణం చేసిన భర్త భార్యపై కోపంతో కన్న కూతురినే చంపేశాడు. ఈ దారుణ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హన్మ పురం గ్రామంలో నివాస ముంటున్న నాగరాణి శ్రీరాములు దంపతులకు రెండేళ్ల కూతురు ఉంది. భార్యాభర్తలిద్దరూ మూగ వారు. అయితే , కొన్ని రోజులుగా దంపతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. బుధవారం రోజు మనవరాలిని తీసుకెళ్లడానికి శ్రీరాములు తండ్రి (తాత) హన్మపురం వెళ్లడంతో ఆయన నుంచి చిన్నారిని తండ్రి శ్రీరాములు లాక్కున్నాడు. ఆ తరువాత గ్రామ శివారులో తీసుకెళ్లి గొంతు నులిమి చంపేశాడు. ఇంటికి వచ్చి పాప స్పృహ కోల్పోయిందని సైగలు చేశాడు. చెరువు సమీపంలో వెళ్లి చూడగా చిన్నారి స్పృహ తప్పిపోయి ఉండడంతో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని బంధువులు తెలిపారు. అనంతరం చిన్నారిని చంపిన తండ్రి పోలీస్ స్టేషన్ కు వెళ్లి తనకు తానుగా లొంగి పోయినాడు. అత్తింటి వారి కారణంగానే తండ్రి శ్రీరాములు పాపను హత్య చేశాడని , అలాంటి వాడిని కఠినంగా శిక్షించాలని భార్య తరపు బంధువులు డిమాండ్ చేశారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరైన వారందరికీ కృతజ్ఞతలు:

● కౌన్సిలర్ మొలుగూరి కమల్



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, ఏప్రిల్ 15:**పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, పోలీస్ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఎస్సీ, ఎస్టీ సామాజిక సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, కుల బాంధవులు, మీడియా ప్రతినిధులు, కౌన్సిలర్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అందరూ కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మూడో వార్డ్ కౌన్సిలర్ మొలుగూరి కమల్ మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# దివ్య బాల పాఠశాలలో అరైవ్-అలైవ్....

● రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన.

● మానవహారం నిర్వహించిన దివ్య బాల పాఠశాల విద్యార్థులు.







**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15:** ఈరోజు "అరైవ్-అలైవ్" కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు దివ్య బాల పాఠశాల విద్యార్థులతో జిల్లా రవాణా శాఖ అధికారి సాయికృష్ణ సిబ్బందితో కలిసి బుధవారం రోజు పాఠశాల విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. దీంతో పాటు , విద్యాసంస్థల బస్సులను 'ఈఐబి' తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాహన పత్రాలు , డ్రైవర్ లైసెన్సులు , మరియు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది.పాఠశాలల వద్ద , బస్సులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే ఆగేలా చూసేందుకు , నిర్దేశిత పికప్ , డ్రాప్ పాయింట్లను స్పష్టంగా గుర్తించి , గుర్తు పెట్టారు. బస్సు ఎక్కేటప్పుడు మరియు దిగేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను నొక్కి చెబుతూ , పాఠశాల బస్సు సిబ్బందికి , పిల్లలకు భద్రతా మార్గ దర్శకాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ట్రాఫిక్ డీఎస్పీ , జిల్లా రవాణా అధికారులు , భువనగిరి ట్రాఫిక్ ఎస్. హెచ్.ఓ , ఇతర అధికారులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో సీమంత కార్యక్రమం



**చిలుకూరు ఏప్రిల్15(ప్రజావాణి):** హుజూర్ నగర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చిలుకూరు సెక్టార్ అంగన్వాడి కేంద్రం 4 నందు పోషణ పక్షంలో భాగంగా సామూహిక సీమంత కార్యక్రమమును నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుభాష్ పాల్గొని గర్భిణీ స్త్రీలకు,ఐదు సంవత్సరముల లోపు బాలబాలికలకు పోషక ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు,తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. బిడ్డ యొక్క వెయ్యి రోజుల బ్రెయిన్ డెవలప్మెంట్ దశలవారీ విషయాలను వివరించి అనంతరము సీమంత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సునీత,టీచర్ సిరికొండ కవిత,వార్డు మెంబర్లు,మహిళలు,తల్లులు పాల్గొన్నారు.

మన సమర్థ ప్రజావాణి తెలుగు డైలీ


# ఎనిమిదవ రోజుకు చేరిన టీవీఏఈసీ జేఏసీ నిరవధిక సమ్మె




**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, ఏప్రిల్ 15:** టీవీఏఈసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరవధిక సమ్మె ఎనిమిదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు తమ డిమాండ్లను మరోసారి ప్రస్తావిస్తూ, టీ వి ఐ సి ఎస్పీడీసీఎల్‌లో (యూఎాణజూ) ఏబీఎస్ఈబీ (APSEB) విధానాలను వర్తింపచేయాలని, అలాగే ఆర్టిజన్ కార్మికులను పీస్ రేట్ నుంచి విలీనం చేయాలని కోరారు. ఈ సమ్మెకు ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నాయకులు నల్ల మనోహర్ రెడ్డి కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికుల డిమాండ్లు సముచితమైనవేనని, వీటిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. న్యాయం జరిగేంత వరకు కార్మికులకు తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీవీఏఈసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లారం కిషన్ రెడ్డి, వైస్ చైర్మన్ కొండలరావు ఆర్ టి జ న్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తాచాటిన విద్య జూనియర్ కళాశాల














**చిత్తూరు ఏప్రిల్ 16 ప్రజావాణి:** ఇంటర్ ఫలితాల్లో విద్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల కరస్పాండెంట్ డా.పి. నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక చిత్తూరు పట్టణం నందు కొంగారెడ్డి పల్లెలో ఉన్న కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా విద్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ డా. పి. నవీన్ కుమార్ మాట్లాడుతూ వెలువడిన ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించారని జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ప్రణయ శ్రీ 433 మార్కులు, బైపీసీలో హేమలత 427 మార్కులు, ఎల్ ఎం డి లో శిరీష 482, లాసియ 479, కార్తీక్ 475, సి. ఎస్. ఈ గ్రూపులో వర్షిత్ 437 మార్కులు, ఎం పి హెచ్ డబ్ల్యు లో హంస 461 మార్కులు, రూబీ 444, చంద్రిక 437, సీనియర్ ఇంటర్ బైపీసీలో మైకేల్ జాన్సన్ 925 మార్కులు, ఎల్ఎండి లో వైష్ణవి 941, ఎం పి హెచ్ డబ్ల్యు లో కావ్య 922, మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన అధ్యాపక బృందానికి,మరియు విద్యార్థిని విద్యార్థులకు, అలాగే యాజమాన్యానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి. నవీన్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రదీప్ అభినందనలు తెలిపారు.

# పెరుగు రాజన్నకుంట ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని


- తహసీల్దార్ కీ గ్రామస్థుడి వినతి



**బెజ్జంకి -కోహెడ, ఏప్రిల్ 15(ప్రజావాణి ):** సిద్ధిపేట కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామ పరిధిలోని పెరుగురాజన్న కుంట చెరువు ఆక్రమణలకు గురై తీవ్రంగా కుదించుకుపోయిందని గ్రామానికి చెందిన రాగుల సతీష్ తహాశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నెం. 369లో సుమారు 29 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు ప్రస్తుతం ఆక్రమణల కారణంగా దాదాపు 9 ఎకరాలకు తగ్గిపోయిందని ఆయన ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు చెరువు భూమిని ఆక్రమించి వ్యవసాయం, చేపల చెరువులు, మామిడి తోటలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గతంలో రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి హద్దులు నిర్ణయించినప్పటికీ, ఇప్పటికీ పూర్తిస్థాయి చర్యలు తీసుకోలేదని వినతిపత్రంలో తెలిపారు. అలాగే సర్వే నెం. 400/9కు సంబంధించిన భూమి విషయంలో కూడా ప్రభుత్వ నిబంధనలను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించారని ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో అక్రమ ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అక్రమంగా పొందిన రైతుబంధు సాయాన్ని తిరిగి వసూలు చేయాలని, అలాగే పెరుగురాజన్నకుంట చెరువుకు వెంటనే హద్దులు నిర్ణయించి రక్షణ చర్యలు చేపట్టాలని తహాశీల్దార్‌ను కోరారు.

# పేద విద్యార్థుల సాంకేతిక విద్య కోసం పలాస లో

- ఐటిఐ ను ఏర్పాటు చేసిన ఘనత స్వర్గీయ మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాధం
- మూడన్నర ఎకరాలు భూమిని సర్కారుకు దానమిచ్చిన మహా నేత డాక్టర్ కణితి విశ్వనాధం
- అన్ని భవనాలు నిర్మించి, ఐటిఐ ను సర్కారుకు దానమిచ్చిన మహా నేత డాక్టర్ కణితి
- ఐదు దశాబ్దాలుకు పైగా పేదలకు వైద్య సేవలు అందించిన మహా నేత డాక్టర్ కణితి విశ్వనాధం..
- గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్యను అందించిన మహా నేత డాక్టర్ కణితి విశ్వనాధం
- కణితి విశ్వనాధం వర్ధంతి సభలో ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ పైలా జవహర్



**పలాస, ప్రజావాణి ప్రతినిధి :** ఇక్కడ పేదలకు సాంకేతిక విద్యను అందించేందుకు వీలుగా పలాస ఐటిఐ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత స్వర్గీయ మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాధం అని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ పైలా జవహర్ అన్నారు. ఈ మేరకు ఇక్కడ ఐటిఐ కాలేజీలో స్వర్గీయ మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాధం వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అధీనం లో ఉన్న సుమారు మూడున్నర ఎకరాల భూమి లో పక్కా భవనాలు ఐటిఐ కోసము నిర్మించినా మహానేత డాక్టర్ కణితి విశ్వనాధం అని ఆయన అన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూమిని అలగే ఐటిఐ కోసము నిర్మించిన భవనాలను సర్కారుకు దానమిచ్చిన మహా నేత డాక్టర్ కణితి విశ్వనాధం అని ఆయన అన్నారు. ఉద్దాన పలాస ప్రాంతము లోని గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్య అందించిన మహా నేత డాక్టర్ కణితి విశ్వనాధం అని పలాస ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ పైలా జవహర్ అన్నారు . ఈ మేరకు బుధవారం ఐటిఐ కాలేజీలో స్వర్గీయ మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాధం వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు మూడున్నరూ గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్య అందించానే సదుద్దేశం తో ఐ టి ఐ ను . 1981 లో స్థాపించి , 2010 లో 3 ఎకరాల27 సెంట్లు స్థలాన్ని మౌలిక వసతులతో ప్రభుత్వానికి దానం చేసిన దాత మరియు పార్లమెంట్ మాజీ సభ్యులు డాక్టర్ కణితి విశ్వనాధం అని గుర్తు చేశారు. తొమ్మిది , పదో తరగతి, లోక్ సభా , సామాజిక సేవ లో భాగంగా ఈ గ్రామీణ ప్రాంతం లో లైన్స్ క్లబ్ 1971-1972 లో స్థాపించి సామాజిక సేవలో ముందున్న మహోన్నత వ్యక్తి మరియు మాజీ చైర్మనడాక్టర్ కణితి తెలిపారు , అంతే కేకుండా వైద్యునిగా 55 సంవత్సరాలు ప్రజలకు వైద్య సేవలు అందించిఅందరి మన్ననలు అందుకున్న మహనీయుడు డాక్టర్ కణితి విశ్వనాధం అని అన్నారు. విశ్వనాధం 3వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ వి కణితిస్ గవర్నమెంట్ ఐటిఐ ప్రాంగణంలో ,కీ శే లయన్ డాక్టర్ కణితి విశ్వనాధం గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కళాశాల ప్రిన్సిపాల్ లయన్ పైల. జవహర్ అలాగే ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు నివాళులు అర్పించడం జరిగింది.

# పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు తెలుగు దేశము రాష్ట్ర పార్టీ కీలక బాధ్యతలు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర తెలుగు దేశము పార్టీ అధిష్టానం




**పలాస ప్రజావాణి ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కు కీలకమైన పదవి దక్కింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష తనపై నమ్మకంతో ఈ భారీ బాధ్యతను అప్పగించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, నారా చంద్రబాబు నాయుడుకు అలాగే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ నారా లోకేష్ గారికి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అధినేతలు తనకు గుర్తింపు నించి నందుకు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కు జాతీయ అధ్యక్షుడాక్టర్ నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవ చేసే అరుదైన అవకాశాన్ని కల్పించినందుకు పార్టీకి రుణపడి ఉంటాను. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతం కోసం మరియు ప్రజల సేవ కోసం పూర్తి నిబద్ధతతో, నిరంతర కృషితో ముందుకు సాగుతాను." అని పేర్కొన్నారు. పలాస నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆమెకు ఈ పదవి దక్కడం పట్ల పలాస నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నేతన్నలకు నేటి నుండి మే 13 వరకు వైద్య శిబిరాలు...

- ఒక ప్రకటనలో తెలిపిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15:** జిల్లాలోని చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నేటి నుండి మే 13 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా సుమారు 10,323 మంది చేనేత కార్మికులు నివసిస్తున్నారని ఆయా మండలాలు , గ్రామాలలో ఈ నెల 16వ తేదీ నుండి ఆరోగ్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆరోగ్య శిబిరాలలో ప్రభుత్వ వైద్యులు అయిన జనరల్ ఫిజీషియన్ , ఆప్తమాలజిస్ట్ (కంటి వైద్యుడు) , ఆర్థోపెడిషియన్ (ఎముకల వైద్యుడు) పాల్గొని చేనేత కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి , అవసర మైన మందులు అందజేయ బడును. ఈ శిబిరాలలో చేనేత కార్మికులకు రక్తపోటు పరీక్షలు , షుగర్ పరీక్షలు , కంటి పరీక్షలు , ఎముకల సమస్యల నిర్ధారణతో పాటు వివిధ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించబడును. వ్యాధుల తీవ్రతను బట్టి రిఫరల్ హాస్పటల్ తీసుకొని వెళ్లడం జరుగుతుందని తెలిపారు .శిబిరాల సమయం ఌ తేది ప్రతి రోజు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఆరోగ్య శిబిరాల తేదీలు , ప్రదేశాలు అందుబాటులో ఉంటాయన్నారు. 16-4-2026 ఆలేరు మండలం గౌడ సంఘం మందిరం , 17-04-2026 ఆత్మకూరు మండలం పిహెచ్సి ఆత్మకూరు ,18-04-2026 యుపిహెచ్సి భువనగిరి , 20-04-2026 నుండి 23-04-2026 వరకు చౌటుప్పల్ కొయ్యలగూడెం , కుంట్లగూడెం ప్రాంతాలు 24-04-2026 పీహెచ్సీ మోటకొండూరు , 25-04-2026 పీహెచ్సీ మోత్కూర్ , 27-04-2026 నుండి 02-05-2026 వరకు పోచంపల్లి సొసైటీ డైయింగ్ హౌస్ , 04-05-2026 పిహెచ్సి రాజాపేట , 05-05-2026 , 06-05-2026 సిహెచ్సి రామన్నపేట , 07-05-2026 పిహెచ్సి వలిగొండ , 08-05-2026 పిహెచ్సి యాదగిరిగుట్ట , 11-05-2026 పిహెచ్సి గుండాల , 12-05-2026 పిహెచ్సి నారాయణపూర్ 13-05-2026 పుట్టపాక క్లస్టర్ బిల్డింగ్. కావున జిల్లాలోని చేనేత కార్మికులు , వారి కుటుంబ సభ్యులు ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసు కోవలసిందిగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు.




**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం రోజు భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు , సిబ్బంది ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను చెక్ చేశారు. డాక్టర్లు , సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అందు బాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రతిరోజు ఓ.పి కి ఎంతమంది వస్తున్నారని ఓ.పి రిజిస్టర్ ను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో తిరుగుతూ పేషంట్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు , సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందిస్తున్నారా..అని ఆసుపత్రికి వచ్చిన పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. డాక్టర్లు , సిబ్బంది మంచిగా చూస్తున్నారా..అని ఆరా తీశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ప్రతిరోజు శుభ్ర పరచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలి



**రాయికల్ :ఏప్రిల్ 15 (ప్రజావాణి) :**రోడ్డు నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని పలువురు అధికారులు పేర్కొన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్-అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, యువకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుండే ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని,ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.'అతి వేగం ప్రమాదకరం' అని గుర్తిస్తూ, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవడమే లక్ష్యంగా ఉండాలని తెలిపారు.అనంతరం మండల విద్యాధికారి (ఎంఈవో) శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ.. విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు, ఇరుగుపొరుగు వారికి వివరించి సామాజిక బాధ్యతను చాటాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రమశిక్షణతో పాటు సామాజిక స్పృహ కల్పించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాయికల్ ఎస్సై సుధీర్ రావు, గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి -వెంకటేష్, ఉప సర్పంచ్ వినయ్, గ్రామ వార్డు సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం




**ప్రజావాణి శాయంపేట:**మండలంలోని తహరాపూర్ గ్రామంలో వరంగల్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని శాయంపేట పోలీస్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అరైవ్--అలైవ్ సురక్షితంగా గమ్యానికి చేరండి రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి కుక్కల సరోజన పిలుపు మేరకు నిర్వహించగా, గ్రామ యువత అధిక సంఖ్యలో పాల్గొని హెల్మెట్ ధరించి గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి మెయిన్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువత రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందడం సంతోషకరమని సర్పంచ్ కుక్కల సరోజన తెలిపారు.ఈ కార్యక్రమంలో శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపటం , సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. మన భద్రత మన కుటుంబ భవిష్యత్తుకు అత్యంత ముఖ్యమని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, వార్డ్ సభ్యులు, మరియు ప్రాజెక్ట్ డైరెక్టర్ కుక్కల తిరుపతి, గ్రామ యువకులు బడుగు సునీల్, నిమ్మల రాజకుమార్, కొమ్ముల మల్లికార్జున్, గాజర్ల అజయ్, గోనెలా రాజు, దాసరి నరేష్, బండారి రమేష్, సముద్రాల అనిల్, తాళ్ల రాజకుమార్, వాలుస పృథ్వీరాజ్, కందగట్ల ప్రకాష్, గోనెలా నాగరాజ్, కుక్కల రాజ్‌కుమార్, వాలుస తరుణ్, కుక్కల కుమార్, లోకాల బోయిన శివనాగేంద్ర, కుక్కల దేవేందర్, పంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపల్లిలో విద్యుత్ సమస్యలతో ప్రజల్లో భయం

- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



**బెజ్జంకి,ఏప్రిల్ 15 (ప్రజావాణి):**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలానికి చెందిన ఎల్లంపల్లి గ్రామంలో తీవ్ర విద్యుత్ సమస్యలు నెలకొని ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.సింగిల్ ఫేజ్ లైన్‌కు త్రీఫేజ్ లైన్ కలిసిపోవడంతో అధిక వోల్టేజ్ సరఫరా జరుగుతూ, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఇళ్లలోని విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోవడం, పేలిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు, గట్టిగా శబ్దాలు రావడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.ఈ సమస్య కారణంగా ఫ్యాన్లు, రైస్ కుక్కర్లు, ట్యూబ్ లైట్లు, సెల్‌ఫోన్లు, ఛార్జర్లు, ఇంటి వైరింగ్, స్విచ్‌లు వంటి పరికరాలుదెబ్బతింటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.మాల మహానాడు మండల అధ్యక్షుడు సంగెం రూపేశ్ మాట్లాడుతూ, అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు. ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.ఇప్పటికైనా సమస్యను పూర్తిగా పరిష్కరించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను---ఏడి, ఏఈలను---డిమాండ్ చేస్తున్నారు.

లైన్మెన్ వివరణ

ఈ సమస్యపై లైన్మెన్ బామన్ల రవీందర్‌ను బెజ్జంకి మండల ప్రజావాణి రిపోర్టర్ ఫోన్ ద్వార సంప్రదించగా,వారం రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా సింగిల్ ఫేజ్ డీటీఆర్ వద్ద సమస్య ఏర్పడిందని తెలిపారు.తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టామని,అతి త్వరలోనే కొత్త డీటీఆర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# ఇచ్చాపురం ,కంచిలి జాతీయ రహదారి గుండా పశువులను హైదరాబాద్ కు అక్రమ రవాణాకు అడ్డుకట్టు ఏదీ?

- వారానికి నాలుగు రోజుల పశువులు అక్రమ రవాణ సాగుతుంది
- నామక పట్టుకున్న పోలీస్ శాఖ పై విమర్శలు
- వారానికి కోట్లు రూపాయలు
- పశువులు బిజినెస్ సాగుతుంది.










**పలాస ప్రజావాణి ప్రతినిధి :**హిందువులకు ఆరాధ్య దైవం అయిన ఆవులు కళేబరాలకు బాధితులు రంగంగా ఎగుమతులు జరుగుతున్నాయి. నిజానికి ఇక్కడ పాలకులు మారిన పశువులు అక్రం వ్యాపారము ఆగడము.లేదని చెప్పక తప్పదు. శ్రీకాకుళం జిల్లా కు అటు ఒడిసాకు మధ్యలో ఉన్న ఇచ్చాపురం ,కంచిలి జాతీయ రహదారి మీద గుండా పశువులు అక్రం వ్యాపారము ఆగడము లేదు.ముక్యంగా వారంలో ఐదు రోజులు పాటు పశువులు అక్రం వ్యాపారము జరుగుతుంది. ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు భారీగా పశువులు కబేళాలకు అక్రమంగా తరలిపోతున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.ఇచ్చాపురం అలాగే కంచిలి ప్రాంతాలకు అనుకొని ఉన్న ఒడిశా కు అనుకొని ఉన్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన పశువులు చిన్న చిన్న వాహనాలు పై ఇక్కడకు పశువులు తీసు కోస్తున్నారని తెలుస్తుంది. అక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు ఇక్కడ నుంచి అక్రమంగా పశువులు అక్రం రావణ చేస్తున్నారని పలు ఆరోపణలున్నాయి జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు వివిధ సంతల్లో వాటిని కొనుగోలు చేసి వాహనాల్లో కబేళాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. మూగజీవాలను రవాణా యథేచ్ఛగా కబేళాలకు తరలింపు రవాణాలో నిబంధనలకు తూచ్!అందుబాటులో లేని గోశాలల-పట్టుబడిన పశువులను తిరిగి నిందితులకే అప్పగిస్తున్న వైనం

జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు వివిధ సంతల్లో వాటిని కొనుగోలు చేసి వాహనాల్లో కబేళాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ప్రతి గురు, శుక్రవారాల్లో తెల్లవారు జామున పార్వతీపురం, ఒడిశా, సాలూరు తదితర ప్రాంతాల నుంచి జాతీయ రహదారిలో పెద్దఎత్తున పశు అక్రమ రవాణా జరుగుతుంది. అలాగే, బొబ్బిలి నుంచి విజయనగరం వరకు హైవే మీదుగా పశువులను కంటైనర్లలో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయినా రవాణాను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు.అ క్రమ రవాణాకు సంబంధించి వారానికి కనీసం నాలుగు కేసులైనా నమోదు చేయాలని ఆదేశాలిచ్చినప్పటికీ ఎక్కడా అలా జరగడం లేదు. ఇప్పటికైనా పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరముంది.అధికారులు. మౌనము లేకుండా పశువులు అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు..

# పట్టణంలో మటన్ విక్రయాల్లో నిర్లక్ష్యం -- పరిశుభ్రతపై ప్రజల ఆందోళన

- జాగ్రత్తలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్











**రంగారెడ్డి బిరో //ఏప్రిల్ 15( ప్రజావాణి):**పట్టణంలోని అనేక మటన్ షాపుల్లో పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం పట్ల స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాబాద్ మండల పరిధిలోని సర్దార్ నగర్ మార్కెట్ లో మటన్ విక్రయించే ప్రాంతాల్లో ఈగలు, దోమలు ఎక్కువగా ఉండటం, మాంసం సరిగా కవర్ చేయకపోవడం వంటి పరిస్థితులు వినియోగదారుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి.కొన్ని షాపుల్లో మాంసాన్ని తెరిచి ఉంచడం, శుభ్రత లేకుండా కటింగ్ చేయడం, చెత్తను సరైన విధంగా నిర్వహించకపోవడం గమనించబడింది.దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మటన్ షాపుల్లో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని, షాపుల వద్ద నిత్యం శానిటేషన్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటేనే ప్రజల ఆరోగ్యం రక్షించబడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పరిశుభ్రమైన ఆహారం అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని వారు స్పష్టం చేస్తున్నారు.

# మహమ్మద్ జావేద్ మృతి పట్ల విజయ బాయి తీవ్ర దిగ్భ్రాంతి



**ఖమ్మం టౌన్ ప్రతినిధి మన ప్రజావాణి ఏప్రిల్ 15:** :ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ దుర్మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బానోత్ విజయ బాయి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు.సూర్యాపేట జిల్లా మోతే వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జావేద్ మరణించారన్న వార్త తనను తీవ్రంగా కల్చివేసింది ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జావేద్, పార్టీ కోసం నిరంతరం అంకితభావంతో పనిచేశారని.ప్రజా సమస్యలపై స్పందించే గుణం, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే నేర్పు కలిగిన నాయకుడు జావేద్ అన్నారు. లిఆయన మరణం కాంగ్రెస్ శ్రేణులకు తీరని లోటు ఆవేదన వ్యక్తం చేశారు. జావేద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బానోత్ విజయ బాయి ...

# రామగుండం: నేత్రదాత సంస్మరణ సభ నిర్వహణ





**ప్రజావాణి //గోదావరిఖని :**రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదాత కీశే ఎలుపులా శ్రీధర్ గారి సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు నాయకులు, సభ్యులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే విధంగా నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జావిద్ మృతి

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం టౌన్ ప్రతినిధి మన ప్రజావాణి ఏప్రిల్ 15:**ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు,పీసీసీ సభ్యులు మహమ్మద్ జావిద్ ఆకాల మరణం పట్ల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ..కాంగ్రెస్ పార్టీ నాయకుడిని మాత్రమే కాదు...నాకు ఎంతో ఆత్మీయుడిని కోల్పోయాను. కాంగ్రెస్ పార్టీకి,వ్యక్తిగతంగా నాకు కూడా ఈ మరణం తీరని విషాదాన్ని మిగిల్చింది" అని ఆవేదన వ్యక్తం చేశారు... కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రాయల నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

# మంతని లో విచ్చలవిడిగా ఇసుక మాఫియా.

- పట్టించుకోని మంథని రెవెన్యూ అధికారులు.





**గుంజపడుగు. మన ప్రజావాణి.** మంథని మండలంలోని గుంజపడుగు గ్రామం మీదుగా విచ్చలవిడిగా ఇసుక మాఫియా జోరుగా సాగుతుంది రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోకుండా ఉండడం గమనార్హం నదుల నుంచి వాగుల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి కూలీలతోమంథని మండలంలో భారీగా రవాణా చేస్తున్న ఇసుక మాఫియా. పగలు రాత్రి ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున ఇసుక తరలింపు జరుగుతుంది ఈ వ్యవహారంపై మంతిని రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు ఇసుక మాఫియా కాసిపేట గుల్ల దగ్గరలో ఉన్న ఇసుక ర్యాంపు నుండి గుంజపడుగు గ్రామంలో నుండి ట్రాక్టర్ లో ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు 1400 రూపాయలు వసూలు చేస్తున్నారు ఇందిరమ్మ ఇండ్ల పేరు చెప్పి చిల్లపల్లి దుబ్బపల్లి చందనాపూర్ సింగిరెడ్డిపల్లి నాగారం కన్నాల గ్రామాలకు ఇసుక చెలా మని అవుతుంది ఇలా మాఫియా వాళ్లు లక్షల రూపాయలు ప్రజల నుండి దండుకుంటున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక మాఫియాను అడ్డుకోవాలని ప్రజలు అంటున్నారు

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికీ 3 రోజుల జైలు శిక్ష

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి:ఏప్రిల్ 15:**మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి చట్టపరంగా శిక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇటీవల పెద్దపల్లి పట్టణంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 33 మంది పట్టుబడగా, వారిని బుధవారం స్థానిక కోర్టులో హాజరుపర్చారు.ఈ కేసులపై విచారణ జరిపిన సెకండ్ క్లాస్ ఇన్‌చార్జి జడ్జి మంజుల , ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన గడ్డలపల్లి మధుకర్ మరియు ధర్మారం మండలం పైడిచింతలపల్లికి చెందిన కూన మహేష్‌లకు తలో 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.మిగతా 31 మందికి కలిపి రూ.44,600 జరిమానా విధించినట్లు పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు.మద్యం మత్తులో వాహనాలు నడపకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

# చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

● మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి









**మందమర్రి, (మన ప్రజావాణి) ఏప్రిల్ 15:** మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీల కమిషనర్లు రాజలింగు, మారుతి ప్రసాద్, మురళీకృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి మందమర్రి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వేసవి అయినందున ప్రజలకు అంతరాయం లేకుండా ప్రతి రోజు నీటిని సరఫరా చేసే విధంగా కార్యచరణ రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రత్యేకదృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మందమర్రి మండల కేంద్రంలోని నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, ప్రభుత్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపల్ దేవానంద్ లతో కలిసి సందర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. టాంకామ్ ద్వారా విదేశాలలో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, జర్మనీలో ప్రతి సంవత్సరం 5 లక్షల ఉద్యోగుల అవసరం ఉందని, ప్రతి సంవత్సరం 90 వేల వీసాలు జారీ చేసేందుకు ఆ దేశం ముందుకు వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అధునాతన సాంకేతిక కేంద్రాల (ఎ.టి.సి.)ద్వారా 25 వేల మంది యువతకు వివిధ కోర్సులలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని తెలిపారు. టామ్ కామ్ ద్వారా 4 నెలల్లో జర్మన్ భాష నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇదే తరహాలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మా అనుమతి లేకుండా భూమి ఆక్రమిస్తున్నారు



**రాయికల్:ఏప్రిల్ 15 (ప్రజావాణి):** రాయికల్ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో అమృత్ పథకం భూ బాధితులు కుర్మా మల్లారెడ్డి,కుర్మా నారాయణ రెడ్డి, కుర్మా ప్రేమ్ రెడ్డి పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ భవనం దగ్గర ఉన్న 20 గుంటల ప్రభుత్వ భూమిని అమృత్ పథకం కింద ట్యాంకు నిర్మాణం కోసం తమ అనుమతి లేకుండా నియంతృత్వంతో అధికారులు తమ పంట భూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం తీసుకుని భూమిని మాకు అప్పజెప్పాలని రైతులమైన మాకే అల్టిమేటం ఇచ్చారని,మాకు ఉన్నదే ఈ కొద్దిపాటి భూమి అని దీనిని ఆక్రమించుకుంటే మా బ్రతుకులు రోడ్డున పడతాయని వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ జిల్లా కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే, ఎంపీలకు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేదన్నారు. పట్టణంలోని రెవెన్యూ సర్వే నంబర్లు 988/2/1/1, 988/2/1/2/1, 988/2/1/3/1 భూమిలో ఇప్పటికే తాము గ్రామ అభివృద్ధి కోసం ఐకేపీ భవనానికి భూమి ఇచ్చామని, తమ దాతృత్వాన్ని గుర్తించి ప్రభుత్వ అధికారులు న్యాయం చేయాలని కోరారు. పంట భూమిని అన్యాయంగా లాక్కోవాలనుకోవడం సమంజసం కాదని, ఇకనైనా తమ భూమిలో పెట్టిన ప్రతిపాదనను అధికారులు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రాయికల్ మాజీ సర్పంచ్ తురగ రాజరెడ్డి మాట్లాడుతూ బలవంతంగా నిరుపేద రైతుల భూమిని లాక్కోవాలని చూడడం సరికాదన్నారు. గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అధికారుల సహకారంతో రైతులమే భూములు దానమిచ్చి గ్రామ అభివృద్ధికి దోహదపడ్డామని అన్నారు. ఇలా బలవంతంగా భూమిని లాక్కోవడం ఎక్కడ చూడలేదని,రైతులతో సంబంధం లేని భూమిని సర్వే చేయడం, గ్రామసభ పెట్టి ఆమోదించడం, నష్టపరిహారం తక్షణమే ఇస్తామనడం కుట్రపూరితంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వేరే చోట దాత భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఇదే భూమి కావాలని అధికారులు పట్టుబట్టడం సరికాదని,తక్షణమే ఈ పేద రైతుల భూమిలో పెట్టిన అమృత్ పథకం ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాము,లింగారెడ్డి,జలపతి లక్ష్మారెడ్డి,లింగారెడ్డి, వేణు, గంగాధర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి

- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- పక్కగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి
- ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతలా భావించాలి
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- అశ్వారావుపేట పోలీసుల ఆధ్వర్యంలో అర్రైవ్ - అలైవ్ కార్యక్రమం
- రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా కార్యక్రమం







**అశ్వారావుపేట/మన ప్రజావాణి (ఏప్రిల్ 15):** అశ్వారావుపేటలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "అరైవ్ ఎలైవ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మున్సిపల్ పాలకమండలి సభ్యులు, అధికారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం అత్యవసరమని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ "అరైవ్ ఎలైవ్" కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడం అని తెలిపారు. ముఖ్యంగా యువతలో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. చిన్న చిన్న నిర్లక్ష్యాలు కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరిస్తూ,ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాకారులచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో వక్తృత్వ పోటీలు నిర్వహించగా, అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజు, మున్సిపల్ చైర్మన్ శశికళ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం రోడ్లపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజలు కలిసి రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్సై యాయాతి రాజు, అదనపు ఎస్ఐ అఖిల, ఎంపీడీవో అప్పారావు, మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, అంగన్వాడి కార్యకర్తలు, వివోఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనాథలైన చిన్నారులకు శ్రీలక్ష్మి మహిళల బాసట

- రూ. 3,500 ఆర్థిక సాయం అందజేత
- చదువుల గురించి కూడా ప్రస్తావిస్తూ ప్రభుత్వం మరియు దాతలు స్పందించాలని కోరారు.



**చెన్నారావుపేట ఏప్రిల్ 15 (ప్రజావాణి) :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రమ్య, సింధు అనే ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఘటన స్థానికులను కలచివేస్తోంది. గత కొన్ని ఏళ్ల క్రితం తల్లి సరిత మృతి చెందగా, ఇటీవల తండ్రి కుక్కల రాజు కూడా మరణించడంతో ఆ పిల్లలు దిక్కులేని వారయ్యారు. ఈ క్రమంలో మేము సైతం అంటూ శ్రీలక్ష్మి గ్రామైక్య సంఘం సభ్యులు ముందుకు వచ్చారు. బుధవారం బాధిత చిన్నారులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. సంఘం తరపున తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.3,500 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ప్రస్తుతం రమ్య ఇంటర్ పూర్తి చేయగా, సింధు ఫస్ట్ ఇయర్ పూర్తి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో వారి చదువుల గురించి కూడా ప్రస్తావిస్తూ ప్రభుత్వం మరియు దాతలు స్పందించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి గ్రామ సంఘం అధ్యక్షురాలు సంగెం భాగ్యలక్ష్మి, కార్యదర్శి దొమ్మటి సృజన, కోశాధికారి పోలాటి రజిత, సహాయ కార్యదర్శి ఎస్కె నూర్జహాన్, సభ్యులు చింతకింద అరుణ, రాళ్లబండి విమల, ఈర్ల ఉపేంద్ర మరియు వివోఏ ఆరెల్లి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దీనపత్రికలో ప్రచురితమైన వార్తకి విద్యుత్ అధికారుల స్పందన



**బెజ్జంకి, ఏప్రిల్ 15(ప్రజావాణి):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యల కారణంగా ప్రజల్లో నెలకొన్న భయం, ఆగ్రహంపై విద్యుత్ అధికారులు స్పందించారు. గ్రామంలో సంఘటన స్థలాన్ని సందర్శించి సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని ఏఈ, ఏడి అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షులు సంగెం రూపేశ్ మాట్లాడుతూ ప్రజావాణి బెజ్జంకి మండల రిపోర్టర్ కేడిక రాజశేఖర్ రెడ్డికీ,విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి ఏప్రిల్ 15 (ప్రజావాణి):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలోని మాజీ జడ్పీటీసీ వ్యాల్లా అనిత దేవేందర్ రెడ్డి అత్తమ్మ వ్యాల్లా వజ్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ క్రమంలో పలువురు రాజకీయ నాయకులు, ఈ విషయం తెలుసుకుని శనివారం రోజున వారి నివాసానికి చేరుకుని వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనిత దేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ పరామర్శలో ఏఎంసి మాజీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్, ఎండపల్లి మాజీ సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి, తాజా మాజీ ఏఎంసి చైర్మన్ గుండేటి గోపిక జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, నాయకులు కోమటిరెడ్డి సంజీవరెడ్డి, వీరితో పాటు పలువురు గ్రామస్తులు, నాయకులు హాజరయ్యారు.

# రామగుండం: "ప్రియమైన నాన్నా..." లేఖలతో రోడ్డు భద్రత చైతన్యం






**ప్రజావాణి //గోదావరిఖని :** గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సీఐ ఇంద్రసేన రెడ్డి నేతృత్వంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులతో మానవహారాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు "హెల్మెట్ ధరించండి" అంటూ భావోద్వేగ పోస్టుకార్డ్ లేఖలు రాయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చలాన్లు విధించారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి ఏప్రిల్ 15 (ప్రజావాణి):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలోని స్థానికురాలు గడ్డం లచ్చవ్వ వారం రోజుల క్రితం మరణించగా, శోకసంద్రం లో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఉమ్మడి వెల్గటూర్ మండల తాజా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డిలు లచ్చవ్వ కుమారులైన గడ్డం స్వామి రెడ్డి, నంది రెడ్డి లతోపాటుగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి. లచ్చవ్వ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు జలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మంజూరు పత్రం అందజేత





**దుబ్బపల్లి. మన ప్రజావాణి** మంతని మండలం దుబ్బ పల్లి గ్రామపంచాయతీలో తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇండ్ల మంజూరు పత్రాన్ని తెలంగాణ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా రామగిరి కొమరమ్మ దుబ్బ పల్లె గారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాన్ని అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెరవెల్లి కృష్ణవేణి నరేష్ రావు పాల్గొని మన గ్రామంలోని రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయవలసిందిగా మరియు స్టీల్ బ్యాంక్ గురించి మాట్లాడడం జరిగింది అలాగే దుబ్బ పల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన పలు అభివృద్ధి పనులకై సహకరించాల్సిందిగా తెలంగాణ మంత్రివర్యులు దుదిల్ల శ్రీధర్ బాబు గారిని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుడుదుల రవి మాజీ సర్పంచ్ నరేష్ రావు పాల్గొన్నారు

# ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ బోడ మురళి నాయక్



**చెన్నారావుపేట, ఏప్రిల్ 15:** ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించి వడదెబ్బ బారి నుండి తమను తాము కాపాడుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ బోడ మురళి నాయక్ విజ్ఞప్తి చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారని, ఈ క్రమంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గొడుగు వాడాలనీ తలపై నేరుగా ఎండ పడకుండా టోపీ లేదా రుమాలు కట్టుకోవాలనీ తెల్లని లేదా లేత రంగులో ఉండే పలుచని కాటన్ వస్త్రాలను ధరించడం ఉత్తమం. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలనీ ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ నీరు లేదా ఓఆర్ఎస్ (ORS) ద్రావణాన్ని తరచుగా తీసుకోవాలి. ఒకవేళ ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే వారిని చల్లని ప్రదేశానికి తరలించాలని మురళి నాయక్ సూచించారు. చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని పూర్తిగా తుడవాలని, బాధితులను ఫ్యాన్ కింద ఉంచి గాలి తగిలేలా చూడాలన్నారు. పరిస్థితి విషమిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఆయన కోరారు. ప్రజలందరూ ఈ జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# పిండిప్రోలు గ్రామంలో రోడ్డు భద్రతపై మానవహారం

- విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసులు
- పిండిప్రోలులో రోడ్ సేఫ్టీపై విస్తృత అవగాహన కార్యక్రమం.



**తిరుమలాయపాలెం, ప్రజావాణి:** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని తిరుమలాయ పాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. బుధవారం ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో పిండిప్రోలు గ్రామ కేంద్రంలో రోడ్ సేఫ్టీ ప్రోగ్రామ్‌లో భాగంగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ హై స్కూల్‌లో "ఎర్రివ్--అలీవ్ " పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించి, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు తెలియజేశారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. గ్రామ కేంద్రంలో నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను వివరించి, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టానికి దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ తిరుపతి రెడ్డి, గవర్నమెంట్ హై స్కూల్ హెడ్ మాస్టర్, పీఈటీ మేడం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉల్లంపల్లి లో నాణ్యత లేకుండా సీసీ రోడ్లు

- అభివృద్ధి పేరుతో ప్రజాధన దుర్వినియోగం: వార్డు సభ్యుడు సయ్యద్ షరీఫ్ ఫైర్





**మన ప్రజావాణి ప్రతినిధి (చిగురుమామిడి):** గ్రామంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని వార్డు సభ్యుడు సయ్యద్ షరీఫ్ తీవ్రంగా విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీసీ రోడ్ల నిర్మాణంలో ప్రతిరోజూ నీళ్లు పట్టకపోవడం వల్ల తక్కువ కాలంలోనే కంకర తేలిపోవడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. నాసిరకం మెటీరియల్ వినియోగం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని మండిపడ్డారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఇటీవల పోసిన సీసీ రోడ్లకు సరైన వాటర్ క్యూరింగ్ చేయడం లేదని, కాంట్రాక్టర్ మరియు గ్రామ సర్పంచ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారుల సమక్షంలో పనులు జరగాల్సి ఉండగా నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని విమర్శించారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ పర్యవేక్షణలో పూర్తిగా విఫలమయ్యారని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తానని సయ్యద్ షరీఫ్ హెచ్చరించారు.

# పెద్దమాలగా కట్ట శ్రీను గారు ప్రమాణ స్వీకారోత్సవం



**గరిడేపల్లి ప్రజావాణి ఏప్రిల్ 15:** నిన్నటి రోజున అనగా బాబా సాహెబ్ Dr.Br. అంబేద్కర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ రెండు తెలుగు రాష్ట్రాలలో ఎవరు కూడా చూడనీ చేయని ఒక నూతన వరవడిని శ్రీకారం చుట్టారు పొనుగోడుమాల గ్రామ ప్రజలు. పెద్దమాలగా కట్ట శ్రీను గారు, గౌరవ పెద్దమాల పదవికి ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం సూర్యాపేట జిల్లా, గరిడేపల్లి మండలం, పోనుగోడు గ్రామంలో మాలలు అందరు కలిసి స్కూల్ అసిస్టెంట్ కట్ట శ్రీను గారిని పెద్దమాలగా ఎన్నుకోవడం జరిగింది. తన యొక్క పెదమాల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఎవరెస్టు గ్లోబల్ కన్సల్టింగ్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ కందుల గోవింద్ గారు, పెదమాలగా ఎన్నికైన కట్టా శ్రీను గారిని ప్రమాణ స్వీకారం చేపించటం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా DSP డాక్టర్, బైరం గంగాధర్ గారు, MEWS State వైస్ ప్రెసిడెంట్ వాస్తు నాగేశ్వరావు గారు, మునగాల MEO, పిడతాల వెంకటేశ్వర్లు గారు, టీచర్ చెవుల బిక్షం గారు, పొనుగోడు గ్రామ సర్పంచ్ మరియు పొనుగోడు మాల ప్రజలందరూ ఈ యొక్క కార్యక్రమానికి హాజరై అంబేద్కర్కి ఘనమైన నివాళులర్పించి పెద్దమాల కట్టా శ్రీను గారికి అభినందనలు తెలియజేయడం జరిగింది

# రోడ్డు భద్రత దినోత్సవం - పాఠశాల విద్యార్థుల మానవహారం



**మన ప్రజావాణి పినపాక నియోజకవర్గం ఏప్రిల్ 15:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా అశ్వాపురం మండలం పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ అశ్వాపురం పాఠశాల విద్యార్థులు, అశ్వాపురం అంబేద్కర్ సెంటర్లో రోడ్డు భద్రత దినోత్సవ సందర్భంగా ఏప్రిల్ 15 న రహదారుల భద్రత నియమాల గురించి తెలియజేయడం కొరకు పాఠశాల నుండి ర్యాలీ, మానవహారం, రోడ్డు భద్రత ప్రతిజ్ఞను చేయడం మరియు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచి గౌరవనీయులు సదర్ లాల్ గారు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతూ ఉంటే వెనక తల్లిదండ్రులు కూర్చుంటున్నారు. ఇది రోడ్డు నియమాలకు వ్యతిరేకం. మద్యం సేవించి వాహనాలు నడిపి వారి కుటుంబాలకు దూరమవుతున్నారని ద్విచక్ర వాహనాలపై ముగ్గురు నుంచి నలుగురు ప్రయాణిస్తున్నారని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని, ఇలా చేయటం వారి ప్రాణాలకు ముప్పు అని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించినట్లయితే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని వారి కుటుంబాలను కాపాడుకోవచ్చని తెలియజేస్తూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని అశ్వాపురం మండలం ప్రజానీకానికి తెలియజేశారు. మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి యోగితా వేణి గారు మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు పాఠశాలలకు పిల్లలను తీసుకువచ్చేటప్పుడు హెల్మెట్ ధరించి తీసుకురావాలని, రోడ్లపై పిల్లలు ఆటలాడకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పాఠశాల పిల్లలు వాహనాలు నడపరాదని ,రోడ్డుకు ఎడమ వైపు మాత్రమే నడవాలని, రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే దాటాలని రహదారి నియమాలను తెలియజేశారు. తర్వాత రోడ్డు భద్రత ప్రతిజ్ఞ పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ శ్రీను గారు చేయించడం జరిగింది. తర్వాత మెయిన్ రోడ్డు పై ర్యాలీ నిర్వహించి పాఠశాలకు చేరుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ వారు, విద్యార్థులు మరియు పంచాయతీ శాఖ వారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. పాఠశాల యందు 1)విద్యార్థులకు రోడ్డు భద్రత- మన బాధ్యత పై వ్యాసరచన 2) రోడ్డు ప్రమాదాలు - నివారణ పై వకృత్వం 3)తండ్రికి తప్పక హెల్మెట్ ధరించమని తనకు ,అమ్మకు కూడా హెల్మెట్ కొనివ్వమని తమ తండ్రికి కుమార్తె/కుమారుడు వ్రాయు లేఖ 3) రోడ్డు భద్రతపై విద్యార్థులు ప్రత్యేకంగా షార్ట్ ఫిల్మ్స్, రోల్స్ నూట్ చేయించడం జరిగింది మరియు బహుమతులు అందజేయడం జరిగింది.

# క్రీడలతోనే మానసికోల్లాసం

- ఘనంగా ముగిసిన బర్ల దేవదాస్ స్మారక క్రికెట్ టోర్నీ
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్సై రాజేష్ రెడ్డి, కంది కృష్ణ చైతన్య రెడ్డి



**చెన్నారావుపేట ఏప్రిల్ 15 (ప్రజావాణి):** క్రీడలు మనిషికి శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో గ్రామ పెద్ద దివంగత బర్ల దేవదాస్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బర్ల శ్రీకాంత్ ఆర్థిక సౌజన్యంతో, ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినమండల స్థాయి టి-10 క్రికెట్ క్రీడోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ముందుగా బర్ల దేవదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రతిభ చాటిన జట్లకు నగదు పురస్కారాలతో పాటు ట్రోఫీలను అందజేశారు ప్రథమ బహుమతి చెన్నారావుపేట లెవెన్ థండర్స్ జట్టు రూ. 10,116 ట్రోఫీ గెలుచుకున్నారు. నంబర్ వన్ కాలనీ ఫ్రెండ్స్ యువజన సంఘం జట్టు రూ. 5,116 ట్రోఫీ గెలుచుకున్నారు. అద్భుత ప్రదర్శన చేసిన బర్ల కార్తీక్‌కు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసేందుకు ఇలాంటి టోర్నీలు దోహదపడతాయని పేర్కొన్నారు. యువత క్రీడల్లో స్నేహభావంతో మెలుగుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తండ్రి జ్ఞాపకార్థం క్రీడలను నిర్వహించిన బర్ల శ్రీకాంత్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత బర్ల శ్రీకాంత్, బర్ల అరుణ, కొంకటి రవి, ఆకులపెల్లి నరేష్, నర్మెట్ట సాంబయ్య, వార్డు సభ్యులు ఈసంపల్లి ఐలయ్య, కొమ్ముల పూలబాబు, ఫ్రెండ్స్ యువజన సంఘం ప్రతినిధులు సింగిరెడ్డి అనిల్, జంగిలి రాజేష్, సాధు నర్సింగరావు, సాదు రాజు, ప్రదీప్, సాగర్, అజయ్, సుదర్శన్, ప్రవీణ్, కార్తీక్, సాత్విక్, ఈశ్వర్, ప్రజ్వల్, బబ్లు, బింటు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలు అమలు శూన్యం కేటిఆర్

- ఇల్లు కొట్టేది లేదు కూల్చడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం











**మేడిపల్లి ఏప్రిల్ 15( మన ప్రజావాణి)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని కేటిఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుదవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీలో చేరికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ కొడే పోచయ్య, విద్యావేత్త ఆకుల మధుకర్, వెల్లంకి శశిధర్ రెడ్డి, దొంతిరి మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఒంటెరు మాధవ రెడ్డి, సోమిరెడ్డి తో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులను బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలపై డీలిమిటేషన్ పేరుతో అన్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. అలాంటి ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని గుర్తుచేసిన కేటీఆర్, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. హైదరాబాద్‌లో భూకబ్జాలు పెరిగిపోయాయని, ప్రజలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయని, కేంద్రం-రాష్ట్రాల మధ్య సమన్వయం లోపంతో అభివృద్ధి నిలిచిపోయిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మళ్లీ బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మైనారిటి అధ్యక్షులు జిలాని పాష, జావీద్ ఖాన్, మాజీ మేయర్లుసామల బుచ్చిరెడ్డి, మేకల కావ్య, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, మీసాల కృష్ణ, కొండల్ రెడ్డి, శేఖర్, మాధవ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్, పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం, ఘట్కేసర్ నాయకులు మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబాల సదానందం కు దళిత రత్న అవార్డు

- ఉద్యమకారునికి దక్కిన అరుదైన గౌరవం
- తనుగులవాసి అంబాల సదానందంకు దళిత రత్న







**జమ్మికుంట ఏప్రిల్ 15 (ప్రజావాణి):** జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామానికి చెందిన ఉద్యమకారుడు అంబాల సదానందంకు అరుదైన గౌరవం దక్కింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో ధూమ్ ధామ్.తో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ సందర్భంలో తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనమెత్తుకొనితనకున్న కళతో ప్రజల మనస్సును సదానందం గెలుచుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో వేదికలపై వందలాది కార్యక్రమాలలో బోనమెత్తుకొని నాడు ఉద్యమాన్ని కీలక దశలోకి తీసుకెళ్లడంలో తెలంగాణ ఉద్యమ కారుడిగా తనదైన కీలకపాత్రను సదానందం పోషించారురాష్ట్రం ఏర్పడిన ఇన్నాళ్ల తర్వాత రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత ప్రజాపాలనలో గుర్తింపు లభించిందిమహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన అంబాల సదానందం కు ఉత్సవ కమిటీ ఉపాధక్షులు బైరి వెంకటేష్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందజేశారు ఈ సందర్బంగా అంబాల సదానందం మాట్లాడుతూదళిత రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తూఈ కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి, 135వ అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్, ఎస్సి, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఉత్సవ కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలుతెలిపారుకార్యక్రమంలో దళిత రాష్ట్ర నాయకులు బత్తుల పాండు సామజిక కార్యకర్త అంబాల రజనీకాంత్ జక్కే రాజేష్ అనిల్ సందీప్ అంబేద్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రుతురాజ్ ఉరుకులాట తగ్గించాలి

● రవిచంద్రన్ అశ్విన్ కీలక సలహా




ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ బ్యాటింగ్‌తో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. బ్యాటింగ్‌లో దూకుడు తగ్గించి, క్రీజులో సెట్ అయ్యేందుకు టైమ్ తీసుకోవాలన్నాడు. బంతిని గాల్లోకి లేపకుండా.. సంజూ శాంసన్, ఆయుష్ మాత్రే తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలని సూచించాడు. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న కేకేఆర్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు కావాలని అభిప్రాయపడ్డాడు. మంగళవారం చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 32 పరుగుల భారీ తేడాతో కేకేఆర్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ గురించి జియో హాట్‌స్టార్‌లో మాట్లాడిన అశ్విన్.. సీఎస్‌కే వరుస విజయాలు సాధిస్తున్నా.. రుతురాజ్ గైక్వాడ్ బ్యాటర్‌గా సత్తా చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.'వరుసగా రెండు విజయాలు కెప్టెన్‌గా రుతురాజ్‌కు పెద్ద ఊరటనిస్తుంది. కానీ అతను బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అతను తిరిగి ఫామ్ అందుకోవాలంటే బ్యాటింగ్‌లో సాంకేతిక లోపాలను సరిచేసుకోవాలి. టీ20 అంటేనే దూకుడుగా ఆడటం అయినప్పటికీ.. రుతురాజ్ బౌలర్ లైన్ దాటి మరీ ముందుకు వచ్చి త్వరగా వికెట్ పారేసుకుంటున్నాడు. ఆయుష్ మాత్రే, సంజూ శాంసన్ తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలి. ఇన్నింగ్స్ ప్రారంభంలో కాస్త నిదానంగా వ్యవహరించి, బంతిని సరిగ్గా టైమింగ్ చేస్తూ ఎక్కువ సేపు క్రీజులో ఉంటే రుతురాజ్ తన ఫామ్‌ను తిరిగి పొందుతాడు. రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో నేనున్నా ఆందోళన చెందను. కెప్టెన్‌గా సాధించిన విజయాలు అతనిపై ఒత్తిడిని తగ్గిస్తాయి.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మరోవైపు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు రావాలని అశ్విన్ తెలిపాడు.

# సన్ రైజర్స్ జట్టులోకి దిల్షాన్ మధుశంక



ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత విజయంతో దూసుకుపోతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్ రాయల్స్‌పై స్టన్నింగ్ విజయం సాధించిన మరుసటి రోజే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ ఈ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే అతను ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. ఈ క్రమంలో అతని స్థానాన్ని భర్తీ చేయడానికి శ్రీలంకకు చెందిన ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మధుశంకను ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఎంపిక చేసింది. ఈ మేరకు ఐపీఎల్ మేనేజ్మెంట్ అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. శ్రీలంక తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న మధుశంకకు స్వింగ్ బౌలింగ్‌లో మంచి పట్టు ఉంది. ఇప్పటివరకు అతను శ్రీలంక తరపున ఒక టెస్ట్, 28 వన్డేలు, 19 టీ20 మ్యాచ్‌లు ఆడి మొత్తం 70 వికెట్లు పడగొట్టాడు. గతంలో ముంబై ఇండియన్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నప్పటికీ, గాయం వల్ల ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం లభించలేదు. ఇప్పుడు రూ. 75 లక్షల ఒప్పందంతో సన్ రైజర్స్ గూటికి చేరుతున్నాడు. పవర్ ప్లే ఓవర్లలో బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టడం ఇతని ప్రత్యేకత. ఇతని రాకతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం సన్ రైజర్స్ బౌలింగ్ యూనిట్ చాలా పటిష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే యువ సంచలనాలు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ తమ అరంగేట్రం మ్యాచ్‌లోనే చెరో నాలుగు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. వీరికి తోడుగా హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్ వంటి అనుభవజ్ఞులు కూడా ఉన్నారు. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఏప్రిల్ 17న టీమ్‌తో చేరే అవకాశం ఉంది. అప్పటివరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో జట్టు ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది.రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో హైదరాబాద్ అదిరిపోయే పర్ఫార్మెన్స్ ఇచ్చింది. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో ప్రఫుల్, సాకిబ్ తమ అద్భుత బౌలింగ్‌తో రాజస్థాన్‌ను 159 పరుగులకే కట్టడి చేశారు. ఈ 57 పరుగుల భారీ విజయంతో టీమ్ ఫుల్ జోష్‌లో ఉంది. ఇప్పుడు అదే ఉత్సాహంతో శనివారం తమ హోమ్ గ్రౌండ్ అయిన రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో మధుశంక అరంగేట్రం చేస్తాడేమో చూడాలి. ఉప్పల్ స్టేడియం వేదికగా జరగనున్న ఈ పోరు కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

# కామెరూన్ గ్రీన్ వరుసగా విఫలమవుతున్నాడు

**గ్రీన్‌ను కొనుగోలు చేసి కేకేఆర్ తప్పు చేసింది**

**భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్**



2026 ఐపీఎల్‌లో భారీ అంచనాలతో అడుగు పెట్టిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ వరుసగా విఫలమవుతున్నాడు. ఇప్పటిదాకా అతడి నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. అటు బ్యాటుతోపాటు బంతితోనూ ఫెయిల్ అవుతున్నాడు. దీనిపై భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందించాడు. గ్రీన్‌ను కొనుగోలు చేసే విషయంలో కేకేఆర్ ఫ్రాంచైజీ తప్పు చేసిందని అభిప్రాయపడ్డాడు. చేసిన తప్పును ఒప్పుకోవడానికి సిగ్గు పడాల్సిన అవసరం లేదని కేకేఆర్‌ను ఉద్దేశిస్తూ అన్నాడు. తాజాగా చిదంబరం స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో కేకేఆర్ ఓడిపోయిన అనంతరం క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ సెహ్వాగ్ ఈ వ్యాఖ్యలు చేశాడు.ఈ మ్యాచ్‌లో సీఎస్కే నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేకేఆర్ 7 వికెట్ల నష్టానికి 160 పరుగులకే పరిమితమై 32 రన్స్ తేడాతో ఓడింది. ఈ మ్యాచ్‌లో గ్రీన్ డకౌట్ అయ్యాడు. ఇప్పటిదాకా ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడిన గ్రీన్ చేసింది కేవలం 56 పరుగులే కావడం గమనార్హం. బౌలింగ్‌లోనూ ప్రభావం చూపించలేదు. ఒకే వికెట్ తీశాడు. దీంతో కామెరూన్ గ్రీన్‌ని అంత డబ్బు పెట్టి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కాగా, గతేడాది జరిగిన మినీవేలంలో గ్రీన్‌ను కేకేఆర్ రూ.25.20 కోట్లకు కొనుగోలు చేసింది."కేకేఆర్ వద్ద చాలా డబ్బు ఉండడంతో కామెరూన్ గ్రీన్‌లాంటి ఆటగాడిపై రూ. 25-27 కోట్లు వెచ్చించింది. కానీ అతడు జట్టుకు భారంగా మారాడు. అతడి మ్యాచ్‌లో ఆడిస్తే, పరుగులు చేయడం లేదు. ఒకవేళ అతన్ని జట్టులోకి తీసుకోకపోతే, అంత డబ్బు ఖర్చుపెట్టి బెంచ్‌కే ఎందుకు పరిమితం చేశారని ఫ్యాన్స్ ప్రశ్నిస్తారు. అందుకే గ్రీన్ విషయంలో కేకేఆర్ తప్పు చేసింది. గ్రీన్‌ను ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టి కోనుగోలు చేశామని ఒప్పుకోవాలి. అందుకు సిగ్గుపడాల్సిన పనిలేదు. ఇప్పటికైనా అతన్ని జట్టు నుంచి తొలగించి, వేరొకరికి అవకాశం కల్పించండి. అతని బ్యాటింగ్, బౌలింగ్ రెండింటి వల్ల టీమ్‌కు ఎలాంటి ఉపయోగం లేదు" అని సెహ్వాగ్ అన్నాడు.గ్రీన్ స్థానంలో టిమ్ సీఫెర్ట్‌ను ఎంపిక చేయాలని సెహ్వాగ్ అన్నాడు. "గ్రీన్‌ను బెంచ్‌పై కూర్చోబెట్టి, అతని స్థానంలో టిమ్ సీఫెర్ట్‌ను ఆడించాలని నేను కోరుతున్నా. ఇటీవల, అతను న్యూజిలాండ్ తరఫున ఎలా ఆడాడో అందరం చూశాం. ఆ జట్టు ఓపెనర్లు (ఫిన్ అలెన్, సీఫెర్ట్) దూకుడుగా ఆడారు. అందుకే వారిద్దరితోనే (అలెన్, సీఫెర్ట్) ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయించండి. ఆ తర్వాత అజింక్య రహానెను మూడో స్థానంలో, పావెల్‌ను నాలుగో ప్లేస్‌లో ఆడించండి. రాఘువంశీని మ్యాచ్‌లో చివరి స్థానంలో పంపించండి. ఒకవేళ రహానె ఔటైతే, రాఘువంశీని క్రీజులోకి దింపండి. ఇంకెవరైనా ఔటయితే, అప్పుడు పావెల్ లేదా రింకు ఆడించండి" అంటూ కేకేఆర్‌కు సెహ్వాగ్ సూచనలు చేశారు. అయితే ఈ సీజన్‌లో కేకేఆర్ ఓటమి అంచుల్లో ఉండగా రన్‌రేట్ కోసం నెమ్మదిగా ఆడుతోంది. ఈ స్ట్రాటజీపైనా సెహ్వాగ్ మాట్లాడాడు.

# పూరన్ పై ఇర్ఫాన్ కీలక వ్యాఖ్యలు



2026 ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అతడు ప్రస్తుత సీజన్‌లో ఎలాంటి ప్రభావం చూపించలేకపోతున్నాడు. అతడి వరుస వైఫల్యాల కారణంగా అభిమానులు అసహనంతో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో లఖ్‌నవూ, బలమైన ఆర్సీబీని బుధవారం ఢీ కొట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో పూరన్‌పై భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇకనైనా అతడు కమ్‌బ్యాక్ ఇవ్వకపోతే జట్టులో అతడి స్థానం ప్రశ్నార్థకం అవుతుందని అన్నాడు. ఈ మేరకు లఖ్‌నవూ – ఆర్సీబీ మ్యాచ్‌కు ముందు తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడాడు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ ఇప్పటిదాకా నాలుగు మ్యాచ్‌లు ఆడింది. అందులో అన్నింట్లోనూ పూరన్ బరిలోకి దిగాడు. కానీ భారీ ఇన్నింగ్స్ ఆడడంలో విఫలమయ్యాడు. నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం 41 పరుగుల చేశాడు. ఇందులో స్ట్రైక్ రేట్ 85.41గానే ఉండడం గమనార్హం. దీంతో పూరన్ వైఫల్యాలపై ఇర్ఫాన్ మాట్లాడాడు. అతడు అరోగ్యం లేదా మైండ్‌సెట్ ఇబ్బందులతో బాధపడుతున్నాడేమో అని అన్నాడు.

# అజింక్యా రహానేకు భారీ జరిమానా..




ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఏదీ కలిసి రావడం లేదు. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో కేకేఆర్ గెలుపు బోణీ కొట్టలేదు. మంగళవారం చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 32 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ సీజన్‌లో కేకేఆర్‌కు ఇది నాలుగో ఓటమి కాగా.. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. అయితే తాజాగా కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానేకు ఐపీఎల్ నిర్వాహకులు షాకిచ్చారు. రూ. 12 లక్షలు జరిమానాగా విధించారు. సీఎస్‌కేతో మ్యాచ్‌లో కేకేఆర్ జట్టు స్లో ఓవర్ రేటు నమోదు చేయడమే అందుకు కారణం. ఈ సీజన్‌లో కేకేఆర్ స్లో ఓవర్ రేటును నమోదు చేయడం ఇదే తొలిసారి కావడంతో కెప్టెన్ రహానే ఒక్కడికే జరిమానా విధించారు. రెండో సారి ఇదే తప్పిదానికి పాల్పడితే అప్పుడు కెప్టెన్‌కు రూ. 24 లక్షల జరిమానాతో పాటు ఇంపాక్ట్ ప్లేయర్ సహా తుది జట్టులోని ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజుల్లో 25 శాతం లేదంటే 6 లక్షలు.. రెండింటిలో ఏదీ తక్కువ అయితే అది జరిమానాగా విధిస్తారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని కనీస ఓవర్-రేట్ ఉల్లంఘనలకు సంబంధించిన ఆర్టికల్ 2.22 ప్రకారం ఈ సీజన్‌లో కేకేఆర్ టీమ్ చేసిన మొదటి ఉల్లంఘన ఇది కావడంతో.. రహానెకు 12 లక్షల రూపాయల జరిమానా విధించారని ఐపీఎల్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సంజూ శాంసన్ (48), డెవాల్డ్ బ్రెవిస్ (41), ఆయుష్ మాత్రే (38) రాణించడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కేకేఆర్ బౌలర్లలో కార్తిక్ త్యాగి 2, వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్, సునీల్ నరైన్‌లు తలా ఓ వికెట్ తీశారు. అనంతరం 193 పరుగుల లక్ష్య ఛేదనలో కేకేఆర్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 160 పరుగులకే పరిమితమైంది. కేకేఆర్ బ్యాటర్లలో రమణ్‌దీప్ సింగ్ (35), రోవ్‌మన్ పావెల్ (31) రాణించారు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్ 3, అన్షుల్ కంబోజ్ 2 వికెట్లు, ఖలీల్ అహ్మద్, అకీల్ హోసేన్ లు చెరో వికెట్ పడగొట్టారు.

# రింకూ సింగ్‌పై కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు




కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) విధ్వంసకర బ్యాటర్ రింకూ సింగ్‌పై భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు గుప్పించాడు. రింకూ సింగ్ హిట్టర్ కాదని, గుడ్డిగా ఆడే గాలిగాడని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కేకేఆర్ వరుస పరాజయాలతో సమతమతమవుతుంది. మంగళవారం చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 32 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో పాయింట్ల ఖాతా తెరిచింది. ఈ ఐదు మ్యాచ్‌ల్లో రింకూ సింగ్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. ఈ క్రమంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన క్రిష్ శ్రీకాంత్.. రింకూ సింగ్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. గతంలో ఎప్పుడో చివరి ఓవర్లో ఐదు సిక్సర్లు కొట్టాడని హిట్టర్‌గా పిలవడం సరికాదని అభిప్రాయపడ్డాడు.'రింకూ సింగ్ ఏం విధ్వంసకర ఆటగాడు కాదు. ఎప్పుడో పాత రోజుల్లో చివరి ఓవర్లో ఐదు సిక్సర్లు కొట్టాడు. దాంతో జనం ఇప్పటికీ అతన్ని ఆకాశానికెత్తుతున్నారు. అతను కేవలం సింగిల్స్, డబుల్స్ తీయడానికి మాత్రమే పనికొస్తాడు. అదీ లక్ష్యం 170 లోపు ఉన్నప్పుడు మాత్రమే. అతన్ని ఐదో స్థానంలో ఆడించడం సరికాదు.రింకూ సింగ్ ఏ మాత్రం హిట్టర్ కాదు. అతను గుడ్డిగా బ్యాట్ ఊపేస్తున్నాడు. తనకి బౌలింగ్ చేసేవాళ్లంతా 'హల్వా' బౌలర్లు అని అనుకుంటున్నాడా కేవలం టీ20 ప్రపంచకప్‌లో ఆడినంత మాత్రాన, ఇలా ఇష్టం వచ్చినట్లు బ్యాట్ ఊపేయకూడదు. వచ్చే మ్యాచ్‌లో అతని స్థానంలో కచ్చితంగా టిమ్ సీఫెర్ట్ బరిలోకి దిగుతాడు.'అని శ్రీకాంత్ విమర్శించాడు. కేకేఆర్ బ్యాటింగ్ విభాగంపై కూడా శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'యంగ్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ గెలవాలనే ఉద్దేశంతో ఆడటం లేదు. ముఖ్యంగా ఓపెనర్ ఫిన్ అలెన్ నిర్లక్ష్యంగా షాట్లు ఆడుతూ వికెట్ పారేసుకున్నాడు. ఒకే విధమైన బంతికి ప్రతి మ్యాచ్‌లోనూ ఔటవుతున్నాడు.అతని బ్యాటింగ్‌లో మార్పు రాకపోతే.. అలెన్ స్థానంలో సీఫర్ట్‌కు అవకాశం ఇవ్వాలి. కామెరూన్ గ్రీన్ కోసం వెచ్చించిన రూ.25 కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యింది. అతను అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లోనూ విఫలమవుతున్నాడు. మూడుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ అయిన కేకేఆర్ ఇంకా గెలుపు ఖాతా తెరవకపోవడం విడ్డూరం.' అని క్రిష్ శ్రీకాంత్ చెప్పుకొచ్చాడు.

# 'పెద్ది' జూన్‌కు వాయిదా..

## కారణమేంటో చెప్పిన మేకర్స్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమాను జూన్ నెలలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ బుధవారం అధికారికంగా ప్రకటించింది.

సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సినిమా ఎడిట్ ప్రింట్ చూసుకున్నామని, అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొంది. "ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభవాన్ని అందించాలనేదే మా లక్ష్యం. అద్భుతమైన కంటెంట్‌ను అంతే గొప్పగా ముస్తాబు చేసేందుకు, పోస్ట్ ప్రొడక్షన్, టెక్నికల్ టీమ్స్‌కు మరికొంత సమయం ఇవ్వాలనుకుంటున్నాం. వారి నైపుణ్యంతో సినిమాను పరిపూర్ణంగా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతలు వివరించారు.

సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలిపిన చిత్రబృందం, అభిమానుల సహకారానికి కృతజ్ఞతలు చెప్పింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్‌లో కచ్చితమైన విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు.

# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి

## భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్'. 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి



దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# మైమరపిస్తున్న భాగ్యశ్రీ..





సినిమా ఇండస్ట్రీలో ఒక్కోసారి అదృష్టం చిత్ర విచిత్రంగా ఉంటుంది. కొందరికి వరుస హిట్లు వచ్చినా గుర్తింపు ఉండదు, కానీ మరికొందరికి ఒక్క సక్సెస్ లేకపోయినా విపరీతమైన క్రేజ్ వస్తుంది. సరిగ్గా ఇదే బాటలో సాగుతోంది యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన అతి తక్కువ కాలంలోనే తన అందం, అభినయంతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ మరాఠీ భామ, ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. అసలు ఈమె ఫేట్ మార్చబోయే ఆ కొత్త ప్లాన్ ఏంటి? ఆ విశేషాలు చూద్దాం.. మిస్టర్ బచ్చన్‌తో ఎంట్రీ.. హిట్టు లేకున్నా క్రేజ్: భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, భాగ్యశ్రీకి మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఆ తర్వాత 'కింగ్డమ్', 'కాంత', 'ఆంధ్ర కింగ్' వంటి చిత్రాల్లో నటించినా, ఇప్పటివరకు ఈ బ్యూటీ ఖాతాలో ఒక్క గట్టి బ్లాక్‌బస్టర్ కూడా పడలేదు. అయినప్పటికీ, స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు మాత్రం ఈమెను వెతుక్కుంటూ వస్తుండటం విశేషం. పక్కింటి అమ్మాయి నుంచి గ్లామర్ డాల్‌గా: ఇప్పటివరకు భాగ్యశ్రీ బోర్సే ఎక్కువగా పక్కింటి అమ్మాయి తరహా పాత్రల్లోనే కనిపించింది. అయితే, కేవలం అవే పాత్రలు చేయడం వల్ల తన కెరీర్ ఆశించిన స్థాయిలో ఊపందుకోవడం లేదని ఈ బ్యూటీ గ్రహించినట్లు సమాచారం. ఇక అందుకే ఇప్పుడు తన రూట్ మార్చాలని నిర్ణయించుకుంది. ఇకపై కేవలం నటనకే పరిమితం కాకుండా, గ్లామర్ విషయంలో కూడా డోస్ పెంచాలని ఫిక్స్ అయిందట. తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు ఈ మరాఠీ సుందరి సిద్ధమవుతోంది.

# 'టాక్సిక్' వాయిదాపై క్లారిటీ..

## పుకార్లకు చెక్ పెట్టిన చిత్రం యూనిట్



రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' విడుదల మళ్ళీ వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చిత్రం బృందం తీవ్రంగా ఖండించింది. ముందుగా ప్రకటించినట్టుగానే జూన్ 4, 2026న సినిమా కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అభిమానులు ఆందోళన చెందవద్దని కోరింది.

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్రం యూనిట్ తెలిపింది. ఈ వదంతులకు చెక్ పెడుతూ, హీరో యశ్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'సినిమాకాన్' ఈవెంట్‌లో ఆయన పాల్గొని, 'టాక్సిక్' అంతర్జాతీయ ప్రమోషన్లను ప్రారంభించారు. ఈ పర్యటనలో యశ్ 'టాక్సిక్'తో పాటు తాను నటిస్తున్న మరో భారీ చిత్రం 'రామాయణ' ప్రమోషన్ల బాధ్యతలను కూడా చూసుకుంటున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'రామాయణ'లో యశ్ రావణుడి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఒకవైపు 'టాక్సిక్' విడుదల పనులు, మరోవైపు 'రామాయణ' ప్రమోషన్లతో యశ్ బిజీగా గడుపుతుండటంతో, వాయిదా వార్తలకు బలం లేదని స్పష్టమవుతోంది.

# టాలీవుడ్‌లో సమ్మె సైరన్

## : మే 1 నుంచి థియేటర్ల బంద్‌కు సిద్ధం



తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల (థియేటర్ యజమానులు) మధ్య నెలకొన్న వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఆదాయంలో వాటా (రెవెన్యూ షేరింగ్) విషయంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో మే 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సమ్మర్ సీజన్‌లో విడుదల కావాల్సిన పలు క్రేజీ సినిమాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఉన్న రెంటల్ పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని థియేటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు, ఓటీటీల ప్రభావంతో ప్రేక్షకుల సంఖ్య తగ్గడంతో థియేటర్లు నడపడం కష్టంగా మారిందని వారు చెబుతున్నారు. అందుకే, మల్టీప్లెక్స్‌ల తరహాలో వసూళ్లలో మొదటి వారం 60 శాతం రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం వాటా ఇచ్చేలా కొత్త రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ ప్రతిపాదనను యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ (టాఫ్రీ+) వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే నిర్మాణ వ్యయాలు విపరీతంగా పెరిగాయని, ఈ సమయంలో రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేస్తే నిర్మాతలు మరింతగా నష్టపోతారని వారు వాదిస్తున్నారు. ఏప్రిల్ 30లోగా ఈ సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె ఖాయమని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు.

ఒకవేళ సమ్మె జరిగితే మే నెలలో విడుదల కావాల్సిన నిఖిల్ 'స్వయంభూ', సమంత 'మా ఇంటి బంగారం', 'కొరియన్ కనకరాజు', 'సూర్య కరుప్పు' వంటి చిత్రాలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ వివాదానికి త్వరగా ముగింపు పలకాలని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

# అవకాశం వస్తే చిరంజీవి సినిమాలో విలన్‌గా చేస్తా

## 'ఎఫ్.సి.ఏ' మీట్ ది ప్రెస్ లో హీరో రాజశేఖర్

ఒకప్పుడు యాంగ్రీ హీరోగా వెండితెరను ఏలిన డా. రాజశేఖర్ తో హైదరాబాద్ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ 'మీట్ ది ప్రెస్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇటీవల విడుదలైన 'బైకర్' చిత్రంలో ఆయన ప్రదర్శించిన నటనకు గుర్తింపుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రభు, అధ్యక్షుడు జె.వి. బత్తుల ప్రసాద్‌రావు, కార్యదర్శి సురేష్ కొండేటి, కోశాధికారి భరద్వాజ తదితరులు రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందించి, సన్మాన పత్రంతో గౌరవించారు. ఈ కార్యక్రమానికి రాజశేఖర్‌తో పాటు ఆయన అర్ధాంగి జీవిత కూడా హాజరయ్యారు. సన్మానం స్వీకరించిన అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ.. 'బైకర్' చిత్రంలోని తన పాత్రకు మంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. "విజయం చూసి చాలా రోజులైంది. ఈ విజయం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ఇతర అవార్డులతో పోలిస్తే క్రిటిక్స్ అసోసియేషన్ ఇచ్చే గౌరవం నాకు చాలా పెద్దది" అని ఆయన భావోద్వేగంగా చెప్పారు. 'అంకుశం' సినిమాకు ముందు, ఇప్పుడు 'బైకర్'కు ముందు యాక్సిడెంట్ జరగడం, ఆ తర్వాత సినిమాలు




హిట్టవ్వడం యాదృచ్ఛికమని, తదుపరి చిత్రం కూడా విజయం సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

జీవిత రాజశేఖర్ మాట్లాడుతూ.. మీడియా తమ కుటుంబానికి ఎప్పుడూ అండగా నిలిచిందని అన్నారు. అయితే, ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో వచ్చే వార్తల వల్ల జర్నలిజంపై కొంత గందరగోళం ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. రాజశేఖర్‌కు ఎన్నో అవకాశాలు వస్తున్నప్పటికీ, తనకు నచ్చిన, స్ఫూర్తినిచ్చే పాత్రల కోసమే ఎదురుచూస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.

సీనియర్ జర్నలిస్టులు ప్రభు, మోహన్ గోటేటి, బాలరెడ్డి, గిరిధర్, ట్రేడ్ గైడ్ వెంకటేశ్వరరావు, జనార్దన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ రాజశేఖర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'అంకుశం', 'అల్లరి ప్రియుడు' వంటి చిత్రాలతో స్టార్‌డమ్ సాధించినా ఆయనలో ఏమాత్రం గర్వం ఉండదని, అందరితో ఎంతో ఆప్యాయంగా కలిసిపోతారని కొనియాడారు. ఆయనది కల్లాకపటం లేని మనసని, ఆయన కెరీర్‌లో జీవిత పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు రాజశేఖర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మంచి కథ వస్తే స్టార్ హీరో చిరంజీవి చిత్రంలోనైనా విలన్‌గా నటించడానికి సిద్ధమని ప్రకటించారు. ప్రస్తుతం పవన్ సాధినేని దర్శకత్వంలో ఒక సినిమా, ఐ.వి. శశి కుమారుడి దర్శకత్వంలో మరో సినిమా చేస్తున్నట్లు తెలిపారు. అటు తమిళ నటుడు విజయ్ రాజకీయ ప్రవేశాన్ని స్వాగతించారు. ప్రజాదరణలో ఎంజీఆర్ తర్వాత అంతటి స్పందన విజయ్‌కే దక్కుతోందని ప్రశంసించారు. రాజకీయాలు ఎంతో ఖర్చుతో, సమయంతో కూడుకున్న వ్యవహారం కాబట్టి, ప్రస్తుతం సినిమాలపైనే దృష్టి పెడుతున్నట్లు స్పష్టం చేశారు. మొత్తం మీద ఈ కార్యక్రమం 'బైకర్' చిత్రంతో రాజశేఖర్ అందుకున్న విజయాన్ని అభినందించడమే కాకుండా, సినీ పాత్రికేయులతో ఆయనకున్న దశాబ్దాల అనుబంధాన్ని గుర్తుచేసింది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com